మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 59 వెల - రూ 5:00

తెలంగాణ జాతీయ దినపత్రిక

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnaga Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yada



## అంతులేని నియంతృత్వం



- దేశంలో ఎన్నడూ చూడని అవినీతి పాలన ఇది
- భాజపాపై కేజ్రీవాల్ ఆగ్రహం

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
ప్రత్యర్థి పార్టీ నేతలందరినీ జైల్లో పెట్టారని ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్భాజపాపై ఆరోపణలు గుప్పిస్తూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.దేశంలో కొనసాగుతున్న నియంతృత్వ పాలన ఆమోదయోగ్యం కాదన్నారు. గత 75 ఏళ్లలో దేశంలో ఎన్నడూ చూడని నియంతృత్వ పాలన కొనసాగుతోందని కమలదళంపై ధ్వజమెత్తారు. అమృత్‌సర్‌లో ఏర్పాటుచేసిన మిగతా 2లో..

# ఆగస్ట్ 15లోపు రుణమాఫీ చెయ్యాలి

## - నేడు మంత్రి వర్గ సమావేశం

- పంట కొనుగోళ్లు, రుణమాఫీపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం
- సచివాలయంలో సీఎం రేవంత్ అధ్యక్షతన సమావేశం - పలు సమస్యలపైనా చర్చ





హైదరాబాద్, (ప్రజా మంటలు):
కొద్ది రోజుల విరామం తరవాత తెలంగాణ మంత్రి వర్గం శనివారం సమావేశం అవుతోంది. పార్లమెంట్ ఎన్నికలనేపథ్యంలో ప్రభుత్వ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. కోడ్ కారణంగా ఏ పనీ చేయలేక పోయారు. ఎన్నికలు ముగియడంతో ఇప్పుడు సిఎం రేవంత్, మంత్రులు సచివాలయం నుంచి తమ విధులను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో శనివారం రాష్ట్ర కేబినేట్ సమావేశం జరుగనుంది. ఇందులో ప్రధానంగా రైతుల రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం తదితర అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. రాష్ట్ర పునర్విభజన జరిగి పదేండ్లు పూర్తి కానుండటంతో పునర్విభజన చట్టానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్నవి, తెలంగాణ, ఏపీ మధ్య అపరిష్కృతంగా ఉన్న అంశాలపై కేబినేట్‌లో చర్చించనున్నారు. . ఉద్యోగులు, ఆస్తులు, అప్పుల విభజనపై నివేదిక ఇవ్వాలని సీఎం రేవంత్.. ఇప్పటికే అధికారులను ఆదేశించారు. రెండు రాష్ట్రాల సయోధ్యతో ఉద్యోగుల బదిలీ సమస్యను పరిష్కరించాలన్నారు సీఎం రేవంత్. క్లిష్టమైన అంశాలపై రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా కార్యాచరణ ఉండాలని అనుకుంటున్నారు. దీనికి సంబంధించి కేబినెట్ లో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. అలాగే ఆగస్ట్ 15లోపు రైతుల రుణమాఫీ చేసి తీరాలని ముఖ్యమంత్రి ఇప్పటికే అధికారులను ఆదేశించారు. అందుకు సంబంధించిన నిధుల సమీకరణపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. తెలంగాణలో దాదాపు 40 లక్షల మంది రైతులు రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారు. రూ. 2 లక్షల వరకు రుణాలు మాఫీ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీని కోసం రూ. 34 వేల కోట్ల వరకు నిధులు మిగతా 2లో..

## విజయం మాదే.. హ్యాట్రిక్ సాధించబోతున్నాం

- మోదీకి అనుమానాలు
- ఇండియా కూటమి బలహీనతే మా బలం
- యూపీ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ విమర్శలు



లక్నో (ప్రజా మంటలు):
విపక్ష ఇండియా కూటమిపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ మరోసారి విరుచుకుపడ్డారు. దేశంలో అస్థిరతను సృష్టించేందుకు ఆ కూటమి ఎన్నికల బరిలో ఉందని మండిపడ్డారు. ఈ సందర్భంగా అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామమందిరం అంశాన్ని ప్రస్తావిస్తూ.. కాంగ్రెస్ సమాజ్‌వాదీ పార్టీ పై ఘాటు విమర్శలు చేశారు. వారు అధికారంలోకి వస్తే రామమందిరంపైకి బుల్డోజర్లను పంపిస్తారని ఆరోపించారు. ఉత్తరప్రదేశ్‌లోని బారాబంకీ ఎన్నికల ప్రచారంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. "శ్రీరామనవమి రోజున రామమందిరంపై మిగతా 2లో..

## అకాల వర్షానికి భారీ పంటనష్టం

- అకాల వర్షంతో అన్నదాతలు ఆగమాగం
- రాష్ట్రవ్యాప్తంగా కల్లాల్లో తడిసి ముద్దైన ధాన్యం

హైదరాబాద్, (ప్రజా మంటలు):
తెలంగాణ వ్యాప్తంగా అకాల వర్షాలకు రైతులు లబోదిబో మంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం తడిసిపోవడంతో కొనేవారు రాక ఆందోళన చెందుతున్నారు. పంట వేసిన దగ్గర నుంచి పంట చేతికి వచ్చేవరకు, కంటిమీద కునుకు లేకుండా కష్టపడుతున్న రైతన్న.. తీరా పంట చేతికి వచ్చాక దళారుల దగ్గర పోరాడలేక ఓడిపోతున్నాడు. తాజాగా అకాల వర్షాలు రైతన్నను నిండా ముంచేస్తున్నాయి. చేతికందొచ్చిన పంట కళ్లెదుటే మట్టిపాలు కావడంతో గుండెలు బాదుకుంటున్నారు. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దవడంతో భోరుమంటున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెద్దఎత్తున ధాన్యం వర్షార్పణమైంది. వానల నుంచి పంటను కాపాడుకోవడం కోసం పడరాని పాట్లు పడుతున్నారు రైతులు. దంచికొడుతున్న వానలు అన్నదాతలను నట్టేట ముంచాయి..నోటి కాడి బుక్క నీటిపాలడంతో రైతన్నలు దిగులుతో తలలు పట్టుకుంటున్నారు. కళ్ళాల్లో ఆరబోసిన ధాన్యం వరదల్లో కొట్టుకుపోతుంటే, రైతన్న గుండె చెరువు అవుతుంది. వరంగల్ ఉమ్మడి జిల్లాలో గతవారం రోజుల నుండి కురుస్తున్న వడగండ్ల వానల ప్రభావంతో వివిధ పంటలకు ఊహించిన విధంగా నష్టం వాటిల్లింది. వేసవిలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం అన్నదాత గుండె చేరువయ్యేలా చేసింది. పగబట్టిన ప్రకృతి రైతులు కుమిలి పోయేలా చేస్తోంది. చేతికి వచ్చిన పంట అమ్ముకునే సమయంలో దరిద్రపుగొట్టు వర్షాలు అన్నదాతలను నట్టేట ముంచాయి. వడగండ్ల వానలు రైతులకు ఊహించని విధంగా నష్టాన్ని కలిగిస్తున్నాయి. వడగండ్ల వానల ప్రభావంతో వరి పంటకు ఊహించని విధంగా నష్టం వాటిల్లింది..వరంగల్, ములుగు,



# కాంగ్రెస్‌ను గెలిపించండి

## - రాజ్యాంగానికి ప్రమాదం పొంచివుంది కాపాడుకుందాం

- రాయబరేలితో అనుబంధం విడదీయలేనిది - ఇందిర నుంచి మమ్మలను ఆదరించారు
- నాలాగే ఇప్పుడు రాహుల్‌నూ ఆశీర్వదించండి - మీ ప్రేమకు సదా రుణపడి ఉంటాం
- రాయ్‌బరేలీ సభలో సోనియా - అమేథీ నుంచే రాజకీయ ఓనమాలు
- తనకు ఈ ప్రాంతంతో విడదీయరాని అనుబంధం - అమేథీతోనే ఉన్నాను..ఉంటాను కూడా
- ఎన్నికల ప్రచారంలో రాహుల్ ఉద్వేగం

రాయబరేలి (ప్రజా మంటలు):
తనను గతంలో ఆదరించినట్లుగానే తన తనయుడు రాహుల్‌ను కూడా రాయబరేలి ప్రజలు ఆదరించాలని, అతను మీ వెన్నంటి ఉంటాడని రాయబరేలి ప్రజలకు ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియాగాంధీకీలక అభ్యర్థన చేశారు. నియోజకవర్గం ప్రజలు తనను ఆదరించినట్టే తన కుమారుడు రాహుల్ గాంధీని కూడా అక్కున చేర్చుకోవాలని కోరారు. ప్రజల ఆశలను రాహుల్ ఏమాత్రం వమ్ము చేయరని అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా తొలిసారి సోనియాగాంధీ రాయబరేలిలో శుక్రవారంనాడు ప్రసంగించారు. సోనియాగాంధీతో పాటు ఆయన కుమారుడు, రాయబరేలి కాంగ్రెస్ అభ్యర్థి రాహుల్ గాంధీ, కుమార్తె ప్రియాంకగాంధీ కూడా ఈ బహిరంగ సభలో పాల్గొన్నారు. చాలా కాలం తర్వాత మీ మధ్యకు రాగలిగినందుకు ఎంతో సంతోషంగా ఉంది. ఎంపీగా మీకు సేవలందించే అవకాశం నాకు కలిగించారు. నా జీవితంలో ఎప్పటికీ దీన్ని మరిచిపోలేను. గత వందేళ్లుగా ఈ గడ్డతో మా కుటుంబ అనుబంధం వేళ్లూనుకుని ఉంది. ఈ అనుబంధం గంగాజలంలా స్వచ్ఛమైనది. అవధ్, రాయబరేలిలో రైతుల మిగతా 2లో..

## ప్రజా నాడి




## స్థిరాస్తి రంగానికి పెద్దపీట

- ప్రతి పౌరుడు లబ్ధి పొందేలా తమ ప్రభుత్వ విధానాలు
- దీర్ఘకాలిక వ్యూహాలతో ముందుకెళ్తున్నాం:మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్, (ప్రజా మంటలు):
ప్రతి పౌరుడు లబ్ధి పొందేలా తమ ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలు ఉంటాయని తెలంగాణ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. దీర్ఘకాలిక వ్యూహాలతో ముందుకెళ్తున్నామని చెప్పారు.నిర్మాణ రంగంలో హరిత భవనాలు పర్యావరణ పరిరక్షణకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. నగరంలోని హైటెక్స్‌లో గ్రీన్ బిల్డింగ్ ప్రాపర్టీ షోను మరో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి శ్రీధర్‌బాబు ప్రారంభించారు."40 శాతం విద్యుత్‌ను నిర్మాణ రంగం వినియోగిస్తోంది. కర్బన ఉద్గారాలు సైతం వెలువడుతున్నాయి. హరిత భవనాల గురించి కొనుగోలుదారులకు నిర్మాణ సంస్థలు అవగాహన కల్పించాలి. 2003లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వీటి నిర్మాణం ప్రారంభమైంది. ప్లాస్టిక్ వినియోగంపై కేంద్రంలోని అప్పటి మన్మోహన్‌సింగ్ సర్కారు కఠిన చట్టాలను తీసుకొచ్చింది. గతంలో పౌర సరఫరాల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు ఆకస్మిక తనిఖీలు చేశాను. కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.మా ప్రభుత్వం ఏర్పడిన ఐదు నెలల్లోనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. ఐటీ రంగంలో రూ.వేలకోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. దీనివల్ల ఉద్యోగాలతో పాటు పరోక్షంగా ఎన్నో అవకాశాలు లభిస్తాయి. సులభతర వాణిజ్య విధానానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. పెట్టుబడిదారులు, నిర్మాణ సంస్థలు, స్థిరాస్తి రంగానికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుంది" అని శ్రీధర్‌బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పీజీఈసెట్ పరీక్షలు వాయిదా

హైదరాబాద్, (ప్రజా మంటలు):
తెలంగాణ వ్యాప్తంగా ఎంఈ, ఎంటెక్, ఎంఫార్మ్ వంటి కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పీజీఈసెట్ పరీక్షను వాయిదా వేయాలని జేఎన్టీయూహెచ్ నిర్ణయించింది. గ్రూప్-1 ఎగ్జామ్స్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షల నేపథ్యంలో పీజీఈసెట్ పరీక్ష తేదీల్లో స్వల్పమార్పులు చేసినట్లు కన్వీనర్ డాక్టర్ ఏ అరుణ కుమారి ప్రకటించారు. ఈ క్రమంలోనే జూన్ 6 నుంచి 9 వరకు జరగాల్సిన పీజీఈసెట్‌ను జూన్ 10 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఓ ప్రకటనలో వెల్లడించారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని, మరింత సమాచారం కోసం ఉన్నత విద్యామండలి వెబ్?సైట్‌ను సందర్శించాలని అధికారులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పీజీఈసెట్ పరీక్షను వాయిదా వేయాలని జేఎన్టీయూహెచ్ నిర్ణయించింది.

మొదటి పేజీ తరువాయి

# 1 అకాల వర్షానికి భారీ పంటనష్టం

మహబూబాబాద్, భూపాలపల్లి, జనగామ జిల్లాల్లో వరి పంట మొత్తం వర్షార్పణమైంది..ఇప్పటికే కోతలు పూర్తయి అమ్మకం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.. చాలా ప్రాంతాల్లో కల్లాల్లో దాన్యం ఆరబోసుకొని అమ్ముకోవడానికి ఎదురుచూస్తున్నారు. మరి కొంతమంది రైతులు రోడ్లపై దాన్యం ఆరబోసుకుని అమ్ముకోవడానికి కళ్ళలో వత్తులు వేసుకుని ఎదురు చూస్తున్నారు. వడగండ్ల వానల నుండి పంటను కాపాడుకోవడం కోసం పడరాని పాట్లు పడుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల కారణంగా ధాన్యం కొనుగోలులో కొంత అంతరాయం ఏర్పడింది. ఆ జాప్యం ఇప్పుడు రైతుల గుండె చేరువయ్యాలా చేస్తోంది. చేతికొచ్చిన పంట వర్షార్పరం అయిపోతుండడంతో రైతులు తల్లడిల్లిపోతున్నారు. అక్కడా.. ఇక్కడన్న తేడా లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి. ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దడంతో రైతులు తల్లడిపోతున్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అన్నదాతలు వేడుకుంటున్నారు. మరోవైపు మామిడి పంటకు కూడా ఇదే రకమైన పరిస్థితి నెలకొంది ఈదురుగాలుల ప్రభావంతో మామిడిపాటంతా నేలరాలిపోయి రైతులు ఆందోళన చెందుతున్నారు.. మిర్చి పంట కూడా దాదాపుగా తుడిచి పెట్టుకుపోతుంది. కళ్ళాల్లో ఆరబోసిన మిర్చి పంటనీతా తడిసి ముద్దమవడంతో రైతులు దిగులుతో తలలు పట్టుకున్నారు. వడగండ్ల వాన ప్రభావంతో తీవ్ర నష్టాన్ని చూసిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు. మరోవైపు వర్షాల ప్రభావంతో ఏర్పడే ఇబ్బందుల నుండి ప్రజలను రక్షించడం కోసం వరంగల్ నగరంతో పాటు జిల్లా కేంద్రాలలో అధికారులు టోల్ ఫ్రీ నెంబర్లను ప్రకటించారు అధికారులు.

## ఆగస్ట్ 15లోపు రుణమాఫీ చెయ్యాలి

అవసరం అవుతాయని అంచనా. రైతు సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రుణమాఫీ చేస్తామని రేవంత్ రెడ్డి చెబుతున్నారు. ఇంత పెద్ద మొత్తంలో నిధులు ఎక్కడి నుంచి వస్తాయన్న దానిపై రేవంత్‌కు క్లారిటీ ఉందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అనుకుంటున్నారు. ఆ దిశగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ధాన్యం కొనుగోళ్ల పురోగతిని సమీక్షించి, వచ్చే ఖరీఫ్ పంటల ప్రణాళికపై చర్చ జరుగనుంది. రాష్ట్ర ఆదాయం పెంచుకునే దిశగా వనరుల సమీకరణ, ఆదాయ పెంపు ప్రత్యామ్నాయాలపై కేబినెట్ లో చర్చిస్తారు. కుంగిపోయిన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల రిపేర్లకు సంబంధించి నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇటీవలే మధ్యంతర నివేదికను సమర్పించింది. నివేదికలోని సిఫారసులు, తదుపరి చేపట్టాల్సిన కార్యాచరణపై ఈ సమావేశంలో చర్చించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. జూన్ నుంచి కొత్త విద్యాసంవత్సరం ఆరంభమవుతుంది. స్కూల్, కాలేజీల ప్రారంభానికి ముందే అవసరమైన సన్నాహక చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. విద్యార్థుల నమోదు, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ల పంపిణీ తదితర అంశాలను చర్చించనున్నారు. అలాగే కార్పోరేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణపైనా చర్చించే అవకాశం ఉంది. గత ప్రభుత్వం హయాంలో ఈ విషయంలో అస్సలు పట్టించుకోలేదు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వంద రోజుల పాలన అనంతరం ఎన్నికల కోడ్ వచ్చింది. ఈ వంద రోజుల్లోనే ఐదు గ్యారంటీలను హడావుడిగా అమలు చేశారు. ఆ పథకాల అమలు తీరుపైనా కేబినెట్ లో చర్చించే అవకాశాలు ఉన్నాయి. లోటు పాట్లు ఉంటే సరిదిద్దుకునేందుకు చర్చించనున్నారు. అలాగే నెరవేర్చాల్సిన హామీలు.. స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు.. లోక్ సభ ఎన్నికల పోలింగ్ సరళిపైనా మంత్రులతో .. కేబినెట్ భేటీ అనంతరం రేవంత్ చర్చించే అవకాశం ఉంది.

## అంతులేని నియంతృత్వం

కార్యక్రమంలో శుక్రవారం పాల్గొన్న ఆయన భాజపా పాలనపై మండిపడ్డారు.అమృత్‌సర్‌లో పంజాబ్ ఆప్ కార్యకర్తలు, ఎమ్మెల్యేలతో సహా పార్టీ నాయకులను ఉద్దేశించి కేజ్రీవాల్ ప్రసంగించారు. పంజాబ్‌లోని మొత్తం 13 లోక్‌సభ స్థానాల్లో ఆప్ విజయం సాధించేందుకు శాయశక్తులా కృషి చేయాలని కోరారు. ప్రత్యర్థులను ఇలా జైల్లో పెడుతుండటం గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. భారత్ పరిస్థితిని రష్యాతో పోలుస్తూ మాట్లాడారు. "రష్యాలో పుతిన్ తన ప్రత్యర్థి నాయకులందరినీ జైలుకు పంపడమో లేదా వారిని చంపడమో చేశారు. ఆపై ఎన్నికలు నిర్వహించి 87 శాతం ఓట్లు సాధించారు. ప్రతిపక్షమే లేనప్పుడు మీకు మాత్రమే ఓట్లు వస్తాయి" అని భాజపాపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు."నన్ను జైల్లో పెట్టారు, మనీష్ సిసోదియా (దిల్లీ మాజీ డిప్యూటీ సీఎం)ను జైలుకు పంపారు. కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతా అటాచ్ చేశారు. టీఎంసీను ఇబ్బందిపెడుతున్నారు. తమిళనాడులో స్టాలిన్ మంత్రులను జైలుకు పంపారు. అందరినీ జైల్లో పెట్టండి. అప్పుడు ఒకే పార్టీ, ఒకే నాయకుడు మిగిలిపోతారు. కానీ ప్రజాస్వామ్యం మనుగడే ఉండదు. ఇలా జరగనివ్వకూడదు" అని కేజ్రీవాల్ అన్నారు. ఇదిలాఉండగా.. లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు కేజ్రీవాల్. ఈ క్రమంలోనే పంజాబ్‌లో ఆప్ అమృత్‌సర్ అభ్యర్థి కుల్దీప్ సింగ్ ధాలివాల్‌కు మద్దతుగా రోడ్‌షో నిర్వహించారు.

## విజయం మాదే..హ్యాట్రిక్ సాధించబోతున్నాం

ఎస్పీకి చెందిన ఓ సీనియర్ నేత అనుచిత వ్యాఖ్యలు చేశారు. మరోవైపు అయోధ్యపై సుప్రీంతీర్పును మార్చాలని కాంగ్రెస్ ప్రయత్నాలు చేస్తోంది. ఈ రెండు పార్టీలకు కుటుంబం, అధికారమే ప్రథమ ప్రాధాన్యం. ఒకవేళ ఎస్పీ-కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వారు రామమందిరంపైకి బుల్డోజర్లను పంపి రామ్‌లల్లాను మళ్లీ టెంట్‌లోకి తీసుకొస్తారు" అని మోదీ దుయ్యబట్టారు."ఓ వైపు భాజపా-ఎన్డీయే కూటమి జాతి ప్రయోజనాలకు జీవితాలను అంకితం చేస్తే.. ఇండియా కూటమి మాత్రం దేశంలో అస్థిర పరిస్థితులను సృష్టించేందుకు పోటీపడుతోంది. ఈ ఎన్నికల తర్వాత వారి కూటమి పేకమేడలా కూలిపోతుంది. జూన్ 4 ఎంతో దూరంలో లేదు. ఈ ఎన్నికల్లో మోదీ సర్కారు హ్యాట్రిక్ కొట్టబోతోందని ప్రపంచమంతా తెలుసు" అని విజయంపై ప్రధాని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై వ్యంగ్యాస్త్రాలు విసిరారు. అమేఠీలో ఆయన పోటీ చేసే సాహసం చేయరని తాను ముందే ఊహించానని, ఇప్పుడు అదే నిజమైందని ఎద్దేవా చేశారు.రాయబరేలి ప్రజలు ప్రధానిని ఎన్నుకుంటారంటూ కాంగ్రెస్ నేత ఒకరు చెప్పడాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎద్దేవా చేశారు. మోదీ ప్రభుత్వం 'హ్యాట్రిక్' సాధించి తీరుతుందని అన్నారు.ప్రజలు అభివృద్ధికి పట్టం కడతారని అన్నారు. 'ఇండియా' కూటమి నేతలు ఒక్కొక్కరే జారుకుంటున్నారని అన్నారు. సమాజ్‌వాదీ పార్టీ రాజకుమారుడు అఖిలేష్ యాదవ్ ఒక కొత్త ఆంటీ (మమతా బెనర్జీ) గొడుగు కింద చేరారు. ఆ కొత్త ఆంటీ పశ్చిమబెంగాల్‌లో ఉంది. మీకు బయట నుంచి మద్దతు ఇస్తామని ఆ కొత్త ఆంటీ ఇండియా కూటమికి చెబుతోందని మోదీ వ్యాఖ్యానించారు. దేశాన్ని మెరుగుపరచేందుకు బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ఒకవైపు, దేశంలో అస్థిరత సృష్టించేందుకు ఇండియా కూటమి ఒకవైపు ఉందని, ఎన్నికలు నడుస్తున్న కొద్దీ ఇండియా కూటమి నేతలు ఒక్కొక్కరే కూటమి నుంచి జారిపోరుతున్నారని చెప్పారు. కేంద్రంలో రాబోయే కొత్త ప్రభుత్వంలో పేదలు, యువకులు, మహిళలు, రైతుల కోసం ఎన్నో పెద్దపెద్ద నిర్ణయాలు తీసుకోనున్నామని మోదీ చెప్పారు. జాతీయ ప్రయోజనాలకు బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే అంకితమైందని చెప్పారు. ఇండియా కూటమి నేతలు ప్రధానులవుతామంటూ పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. తాను 'హ్యాట్రిక్' కొట్టేందుకు, సమాజంలోని అన్నివర్గాల కోసం పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. 500 ఏళ్ల తర్వాత రామాలయం కల సాకారమైందంటే దానికి ప్రజల ఓటు బలమే అందుకు కారణమని అన్నారు. రామమందిరంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తోసిరాజనేందుకు, మందిరంపై బుల్‌డోజర్ నడిపేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉన్నట్టు తమకు తెలిసిందని, న్యాయబద్ధంగా బుల్డోజర్ నడిపించడం ఎలాగో యోగి ఆదిత్యనాథ్ నుంచి కాంగ్రెస్ వాళ్లు తెలుసుకోవాలని సూచించారు. ఇండియా బ్లాక్‌కు ప్రజలు ఓటు వేసి అధికారం ఇస్తే, ఎస్సీ, ఎస్టీ, ఆదివాదీ, ఓబీసీల రిజర్వేషన్లను లాక్కొని తమ ఓటర్లకు ఇవ్వడం ద్వారా బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతుందని హెచ్చరించారు. ప్రధానమంత్రి యూపీలోని ఫతేపూర్, హమీర్‌పూర్‌లోనూ శనివారంనాడు బహిరంగ సభల్లో పాల్గొంటున్నారు.

## బీజేపీతోనే అభివృద్ధి - ఒడిశా ఎన్నికల ప్రచారంలో అమిత్ షా

రౌర్కెలా (ప్రజా మంటలు):ఒడిశాలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ ఎన్నికల్లో బిజూ జనతాదళ్‌ను ఓడించేందుకు భాజపా తీవ్రంగా శ్రమిస్తోంది.ఇందులోభాగంగా సీఎం నవీన్ పట్నాయక్‌పై విమర్శల బాణాలు సంధిస్తోంది. తాజాగా భాజపా అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఒడిశాలోని రౌర్కెలాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు దేశంలో జరిగిన నాలుగు దశల ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో భాజపా 270 సీట్లు ఖాయం చేసుకొని 400 దిశగా దూసుకెళ్తోందని వ్యాఖ్యానించారు. ఈసారి ఒడిశాలోనూ కమలం వికసిస్తుందన్న ఆయన.. ఇక్కడ 75 అసెంబ్లీ, 15 లోక్‌సభ సీట్లు గెలుచుకుంటామని ధీమా వ్యక్తంచేశారు."కొన్నాళ్లుగా కోట్లాదిమంది పూరీ జగన్నాథ్ స్వామి భక్తులు రత్నభాండాగారం గురించే ఆలోచిస్తున్నారు. ఈ భాండాగారం తాళం చెవిల మిస్టరీని బయటపెట్టాలని కోరుకొంటున్నారు. నవీన్ పట్నాయక్ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారు, వారి నమ్మకాలు, విశ్వాసాలతో ఆడుకుంటున్నారు. నవీన్ బాబూ.. రత్న భాండాగారం అసలు తాళం చెవి ఎక్కడ ఉందో చెప్పండి? ఈ విషయాన్ని ఒడిశా ప్రజలు తెలుసుకోవాలనుకొంటున్నారు. నకిలీ తాళాలు ఎవరు తయారుచేశారు? దీనిపై ఏర్పాటుచేసిన విచారణ కమిషన్ నివేదికను ఎందుకు తొక్కిపెట్టారు? భాజపా ప్రభుత్వం ఏర్పాటైన నెల రోజుల్లోనే ఆ కమిషన్ నివేదికను బహిర్గతం చేస్తాం" అని అమిత్ షా హామీ ఇచ్చారు."ఈ ఎన్నికలు నరేంద్ర మోదీని మూడోసారి ప్రధానిని చేసేందుకు, భారత్‌ను ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా తీర్చిదిద్దేందుకు, దేశంలో మూడు కోట్ల మంది అక్కాచెల్లెళ్లను లక్షాధికారులుగా మార్చేందుకు, దేశంలో మూడు కోట్ల మంది పేదలకు ఇళ్లు అందించేందుకు, ఒడిశాలో నవీన్‌పట్నాయక్ సర్కార్‌ను తొలగించి అభివృద్ధిలో నవశకానికి నాంది పలికేందుకు జరుగుతున్న ఎన్నికలు" అని అమిత్ షా అన్నారు.

మోదీపై రిటైర్మెంట్ వ్యాఖ్యలు అర్థం లేనివి

## - కేజ్రీవాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన రాజ్‌నాథ్ సింగ్

లఖ్‌నవూ (ప్రజా మంటలు):

ప్రధాని నరేంద్ర మోదీపై వ్యాఖ్యలు చేసిన దిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌పై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మండిపడ్డారు. మోదీ పదవీ విరమణ చేయనున్నారని, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను పదవి నుంచి తొలగిస్తారని కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలు అర్థం లేనివని అసహనం వ్యక్తం చేశారు.ఉత్తరప్రదేశ్‌లోని రాజాజీపురంలో ఎన్నికల ప్రచారంలో రాజ్‌నాథ్ పాల్గొన్నారు.భాజపా పార్టీ నిబంధనల ప్రకారం 2025లో 75 ఏళ్లు నిండిన అనంతరం ప్రధాని మోదీ రాజకీయాల నుంచి రిటైర్ అవుతారని కేజ్రీవాల్ గురువారం పునరుద్ఘాటించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా తదుపరి ప్రధాని కావడం ఖాయమని, ఆయన కోసమే మోదీ ఓట్లు అడుగుతున్నారని వ్యాఖ్యానించారు. కేంద్రంలో భాజపా తిరిగి అధికారంలోకి వస్తే రెండు నెలల్లో ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి పార్టీ తొలగిస్తుందన్నారు.ఈ వ్యాఖ్యలపై రాజ్‌నాథ్ మాట్లాడుతూ "2024 ఎన్నికల అనంతరం మోదీ ప్రధాని పదవిలో ఉండరని కేజ్రీవాల్ అంటున్నారు. ఆయన మాటలు విని నేను ఆశ్చర్యపోయాను. ఆయన ఇప్పుడే బెయిల్‌పై బయటకు వచ్చారు. జూన్ 1 తర్వాత తిరిగి జైలుకు వెళ్లాలి. భారత ప్రధాని గురించి ఇలాంటి అర్థం లేని మాటలు మాట్లాడుతున్నారు. 2024లోనే కాదు. 2029లోనూ మోదీ ప్రధాని కావాలని దేశం మొత్తం కోరుకుంటోంది. యూపీ సీఎంపై కూడా కేజ్రీవాల్ వ్యాఖ్యలు చేశారు. బలమైన, సమర్థవంతమైన నాయకత్వం గురించి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరం. అబద్ధాలతో రాజకీయాలు చేయలేమని నేను ఆయనకు చెప్పాలనుకుంటున్నాను"అని రాజ్‌నాథ్ తెలిపారు.భాజపా తిరిగి అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం చిక్కుల్లో పడుతుందని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను రాజ్‌నాథ్ కొట్టి పడేశారు. ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఎదురైంది ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలోనే అని ఆయన పేర్కొన్నారు.

## ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ హాల్‌టిక్కెట్లు విడుదల

హైదరాబాద్ (ప్రజా మంటలు):

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుంచి ప్రారంభం కానున్నాయి. జూన్ 3వ తేదీ వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మ. 12 గంటల వరకు ఫస్టియర్ విద్యార్థులకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు సెకండియర్ విద్యార్థులకు పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసింది. సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులు నేరుగా ఇంటర్ బోర్డు వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. హాల్ టికెట్ డౌన్ లోడ్ చేసుకున్న తర్వాత విద్యార్థులు తమ ఫొటో, సంతకం, పేరు, మీడియంతో పాటు ఏయే స్జబెక్టులు రాస్తున్నామో వాటిని గమనించాలి. వాటిలో ఏవైనా తప్పులు ఉంటే తక్షణమే సంబంధిత కాలేజీ ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలి. హాల్ టికెట్లపై ప్రిన్సిపాల్స్ సంతకాలు లేకపోయినప్పటికీ పరీక్ష రాసేందుకు అనుమతించాలని ఇంటర్ బోర్డు చీఫ్ సూపరింటెండెంట్లకు ఆదేశాలు జారీ చేసింది.

## త్వరలో గ్రూప్-4 ఉద్యోగాల సర్టిఫికెట్ వెరిఫికేషన్

హైదరాబాద్ (ప్రజా మంటలు):




గ్రూప్-4 ఉద్యోగాల భర్తీకి సంబంధించి త్వరలోనే సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ వెల్లడించింది. జనరల్ ర్యాంకింగ్ జాబితాను ఈ ఏడాది ఫిబ్రవరి 9వ తేదీన టీఎస్‌పీఎస్సీ విడుదల చేసిన సంగతి తెలిసిందే. జనరల్ అభ్యర్థులను 1:3 నిష్పత్తిలో, పీడబ్ల్యూడీ అభ్యర్థులను 1:5 నిష్పత్తిలో పిలవనున్నారు. కమ్యూనిటీ, నాన్ క్రిమి లేయర్(బీసీలకు), పీడబ్ల్యూడీ సర్టిఫికెట్స్, స్టడీ లేదా రెసిడెన్స్ సర్టిఫికెట్స్(క్లాస్ 1 నుంచి ఏడు వరకు), రిజర్వేషన్ కలిగి ఉంటే దానికి సంబంధించి డాక్యుమెంట్లు, ఏజ్ రిలాక్సేషన్, క్వాలిఫికేషన్ సర్టిఫికెట్లు రెడీగా ఉంచుకోవాలని టీఎస్‌పీఎస్సీ సూచించింది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ సమయంలో వీటిలో ఏ డాక్యుమెంట్ సమర్పించకపోయినా ఆ అభ్యర్థులను పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేసింది.

# కాంగ్రెస్‌ను గెలిపించండి



ఆందోళనతో ఈ అనుబంధం మొదలైందని సోనియాగాంధీ పేర్కొన్నారు. రాయబరేలి ప్రజలు, మాజీ ప్రధాని దివంగత ఇందిరా గాంధీ ద్వారా తాను నేర్చుకున్న పాఠాలే తన పిల్లలైన రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీకి నేర్పానని చెప్పారు. రాయబరేలి ప్రజలకు ఇందిరాగాంధీ హృదయంలో ప్రత్యేక స్థానం ఉండేదని, ఆమె పనితీరును తాను చాలా దగ్గర నుంచి పరిశీలించానని, ఇక్కడి ప్రజలంటే ఆమెకు ఎనలేని అభిమానం ఉండేదన్నారు. ఇందిరాంగాంధీ నుంచి నేర్చుకున్న పాఠాలనే తాను తన పిల్లలకు చెప్పానని తెలిపారు. అందరినీ గౌరవించడం, బలహీనులను పరిరక్షించడం, ప్రజల హక్కులపై జరుగుతున్న అన్యాయాలను ఎదిరించి పోరాడటం, ఎలాంటి భయాలకు తావీయకుండటం వంటి పాఠాలు వారికి నేర్పానని చెప్పారు. రాయబరేలి ప్రజల ప్రేమ కారణంగా తనకు ఒంటరిగా ఉన్నాననే భావన ఎప్పుడూ కలగలేదని సోనియాగాంధీ అన్నారు. 'ఈరోజు నా కుమారుడిని మీ చేతుల్లో పెడుతున్నాను. అతన్ని ఆదరించండి. నన్ను ఎలా ఆదరించాలో నా కుమారుడిని కూడా గుండెల్లో పెట్టుకోండి. రాహుల్ మీ ఆశలను వమ్ము చేయడు' అంటూ సోనియాగాంధీ భావోద్వేగానికి గురయ్యారు. రాహుల్ గాంధీ ప్రస్తుతం పోటీ చేస్తున్న రాయబరేలి నియోజకవర్గానికి సోనియాగాంధీ 2004 నుంచి వరుసగా నాలుగు సార్లు ప్రాతినిధ్యం వహించారు. ఈసారి ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఆమె రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఐదో విడత ఎన్నికల్లో భాగంగా మే 20న రాయబరేలిలో పోలింగ్ జరుగనుంది.

**అమేథీ నుంచే రాజకీయ ఓనమాలు**

కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ అమేథీపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. అమేథీ నుంచే తాను రాజకీయాలు నేర్చుకున్నానని, తాను వారితోనే ఉన్నానని, ఉంటానని చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లోని అమేథీలో కాంగ్రెస్, ఇండియా కూటమి అభ్యర్థి కేఎల్ శర్మ తరఫున శుక్రవారంనాడు ఎన్నికల ప్రచార సభలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. రాహుల్‌తో పాటు అఖిలేష్ కూడా ప్రచారానికి హాజరయ్యారు. ఐదో విడత పోలింగ్‌లో భాగంగా మే 20న అమేథీలో పోలింగ్ జరుగనుంది. రాహుల్ తన ప్రసంగంలో 42 ఏళ్ల క్రితం తన తండ్రి రాజీవ్ గాంధీతో కలిసి అమేథీకి వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. రాజకీయాల గురించి తాను ఏది నేర్చుకున్నా అది ఇక్కడి (అమేథీ) నుంచే నేర్చుకున్నానని, ప్రజలే తనకు నేర్పారని చెప్పారు. తాను తొలిసారి అమేథికి వచ్చిన సమయంలో అప్పుడు రోడ్లు కానీ, అభివృద్ధి కానీ లేదన్నారు. తన తండ్రికి, అమేథీ ప్రజలకు మధ్య ఉన్న ప్రేమానుబంధానికి తానే సాక్షినని చెప్పారు. తాను కూడా ఇదే తరహా రాజకీయాలను పాటిస్తున్నానని తెలిపారు. తాను రాయబరేలి నుంచి పోటీ చేస్తున్నప్పటికీ అమేథీతో మొదట్నించీ తనకున్న అనుబంధం చెక్కుచెదరదని, ఎప్పటికీ అమేథీ ప్రజల వెన్నంటి ఉంటానని చెప్పారు. 2024 లోక్‌సభ ఎన్నికలు చాలా కీలకమని రాహుల్ తెలిపారు. ఒక రాజకీయ పార్టీ, ఆ పార్టీ నేతలు రాజ్యాంగాన్ని తిరగరాస్తామని, రాజ్యాంగాన్ని బుట్టదాఖలా చేస్తామని తొలిసారి చాలా స్పష్టంగా చెబుతున్నారని పరోక్షంగా బీజేపీని ఉద్దేశించి విమర్శించారు. రాజ్యాంగాన్ని చెరిపేద్దామా? రాజ్యాంగాన్ని తుడిచిపెట్టే శక్తి ఈ ప్రపంచంలో ఎవరికైనా ఉందా? అని ప్రజలను ఉద్దేశించి రాహుల్ ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని ప్రజలే పరిరక్షించుకోవాలని, రాజ్యాంగమే ప్రజా వాణి, ప్రజా భవిష్యత్తు అని స్పష్టం చేశారు. ఈ దేశంలో పేద ప్రజలకు ఏది చేసినా, రైతులకు సహాయపడినా, హరిత విప్లవం తెచ్చినా రాజ్యాంగంతోనే సాధించామని చెప్పారు. రాజ్యాంగానికి చరమగీతం పాడాలని నరేంద్ర మోదీ కోరుకుంటున్నారని, రాజ్యాంగం కనుమరుగైతే ఇక ప్రభుత్వ రంగమనేదే ఉండదని, ఉద్యోగాలు ఉండవని, ద్రవ్యోల్బణం తారాస్థాయికి చేరుకుందని, రిజర్వేషన్లకు స్వస్తి పలుకుతారని, ప్రజల హక్కులు ఒక్కొక్కటి ఊడలాక్కుంటారని రాహుల్ హెచ్చరించారు. కేవలం ఎంపిక చేసిన 22-25 మంది కుబేరుల కోసం రైతులు, కార్మికులు, యువత, తల్లులు, సోదరీమణుల హక్కులను హరిస్తారని ఆరోపించారు.లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 140 సీట్లు సాధించడం కూడా కష్టమేనని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ అన్నారు. నాలుగు విడతల ఎన్నికలు పూర్తయ్యే సరికే బీజేపీ ఓటమిదశకు చేరుకుందన్నారు. వారి రథం మునకలేస్తోందని, 400 సీట్లు తమ లక్ష్యమని నినాదాలిచ్చినా ప్రజలు 140 సీట్లకే పరిమితం చేయనున్నారని చెప్పారు. రాజ్యాంగాన్ని, ప్రజల హక్కులను మార్చాలనుకుంటున్న వారిని ప్రజలే మార్చాలనుకుంటున్నారని అన్నారు. అమేథీలో కాంగ్రెస్ అభ్యర్థిగా గాంధీ కుటుంబం విధేయుడుగా పేరున్న కిషోరి లాల్ శర్మ పోటీ చేస్తుండగా, బీజేపీ అభ్యర్థిగా కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ, బీఎస్పీ అభ్యర్థిగా నాన్హె సింగ్ చౌహాన్ పోటీ పడుతున్నారు.

అమేథీ, రాయబరేలీల్లో గెలుస్తున్నాం: కాంగ్రెస్ నేత కెసి వేణుగోపాల్

ఈ లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' బ్లాక్ అత్యధిక స్థానాలను సొంతం చేసుకుంటుందని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి వేణుగోపాల్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. 'మేము రాయబరేలి, అమేథీ రెండు స్థానాల్లో గెలుస్తాము. మీరు ఎక్కడికెళ్లినా ప్రజల మూడ్‌ని గమనిస్తే.. 'ఇండియా' బ్లాక్‌కి అనుకూలంగా ఉంది.' అని ఆయన అన్నారు. బిజెపి 150 సీట్లకు మించి గెలవదని రాహుల్ అనడాన్ని మీడియా ప్రతినిధులు వేణుగోపాల్‌ని ప్రశ్నించగా.. 'రాహుల్ దేశవ్యాప్తంగా పర్యటించారు. ఆయనకు ప్రజల పల్స్ తెలుసు. అందుకే బిజెపికి అంతకన్నా ఎక్కువ సీట్లు రావు అని రాహుల్ అంచనా.' అని ఆయన అన్నారు. కాగా, అమేథీ నుంచి ఇండియా బ్లాక్ అభ్యర్థి కె.ఎల్ శర్మ పోటీ చేస్తున్నారు. ఆయన విజయాన్ని కాంక్షిస్తూ.. సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్, కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ప్రచార ర్యాలీ నిర్వహించారు.

## మద్యం కేసులో నిందితుల జాబితాలో ఆప్

### - ఛార్జ్‌షీట్ దాఖలు చేసిన ఈడీ - కేజ్రీవాల్ అరెస్టు పిటిషన్‌పై తీర్పు రిజర్వ్..

దిల్లీ (ప్రజా మంటలు):

మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ శుక్రవారం మరో అనుబంధ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఇందులో దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆమ్‌ఆద్మీ పార్టీని నిందితులుగా పేర్కొంది.మద్యం కుంభకోణం పై ఈడీ దాఖలు చేసిన ఎనిమిదో ఛార్జ్‌షీట్ ఇది. అయితే, ఈ కేసులో కేజ్రీవాల్‌పై దర్యాప్తు సంస్థ అభియోగాలు మోపడం ఇదే తొలిసారి. మార్చి 21న ఆయనను అరెస్టు చేయగా.. ప్రస్తుతం మధ్యంతర బెయిల్‌పై బయటే ఉన్నారు. ఈ కేసులో ఇప్పటివరకు 18 మందిని ఈడీ అరెస్టు చేసింది.మద్యం కుంభకోణం వ్యవహారంలో ప్రధాన సూత్రధారి, కింగ్‌పిన్ కేజ్రీవాల్ అని ఈడీ ఆరోపించిన సంగతి తెలిసిందే. "నూతన మద్యం విధానం రూపకల్పనలో సీఎం కీలక పాత్ర పోషించారు. ఈ స్కామ్‌లో వివిధ వ్యక్తుల నుంచి అందిన రూ. 100 కోట్ల ముడుపులను ఆమ్ ఆద్మీ పార్టీ 2022 గోవా అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వినియోగించింది. ఆ సమయంలో కేజ్రీవాల్ బస చేసిన ఓ ఏడు నక్షత్రాల హోటల్ బిల్లులను ఈ కేసుకు సంబంధించిన నిందితుడు చెల్లించినట్లు మా వద్ద సాక్ష్యాలున్నాయి" అని ఈడీ తరఫున వాదనలు వినిపించిన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు గురువారం సుప్రీంకోర్టుకు తెలిపారు. ఈ క్రమంలోనే కేజ్రీవాల్, ఆప్‌పై ఈడీ తాజాగా ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. త్వరలోనే పార్టీకి చెందిన కొన్ని ఆస్తులను అటాచ్ చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి.ఇదిలాఉండగా..మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసు లో తనను అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు శుక్రవారం విచారణ జరిపింది.ఇరువర్గాల వాదనలు విన్న జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం ఈ అంశంపై తీర్పును రిజర్వు చేసింది. కేజ్రీవాల్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ, ఈడీ తరఫున సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు బెంచ్ ముందు వాదనలు వినిపించారు. 'వాదనలు విన్నాం. తీర్పును రిజర్వు చేశాం. అప్పీల్‌దారు చట్టానికి అనుగుణంగా బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకు వెళ్లొచ్చు" అని ధర్మాసనం పేర్కొంది.దిల్లీ మద్యం విధానం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై మార్చి 21న ఈడీ అధికారులు కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. దాదాపు 50 రోజుల పాటు తిహాడ్ జైలులో ఉన్న దిల్లీ సీఎంకు ఎన్నికల ప్రచారం నేపథ్యంలో మే 10న సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. తిరిగి జూన్ 2న జైలులో లొంగిపోవాల్సి ఉంటుందని సూచించింది. ఎన్నికల ప్రచారం కోసమే బెయిల్ మంజూరుచేస్తున్నందున కేజ్రీవాల్ ఈ 21 రోజులు ముఖ్యమంత్రి కార్యాలయం/ సచివాలయానికి వెళ్లరాదని, అధికారిక దస్త్రాలపై సంతకాలు చేయరాదని ధర్మాసనం షరతు విధించింది. అయితే, లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతి పొందడం తప్పనిసరి అయిన అత్యవసర దస్త్రాలపై సంతకం చేయడానికి మాత్రం మినహాయింపు ఉంటుందని స్పష్టంచేసింది.

## భారాస ఎమ్మెల్సీ దండె విఠల్‌కు సుప్రీంలో ఊరట- హైకోర్టు తీర్పుపై స్టే

దిల్లీ (ప్రజా మంటలు): భారాస ఎమ్మెల్సీ దండె విఠల్‌కు సుప్రీం కోర్టులో ఊరట లభించింది. ఎమ్మెల్సీగా ఆయన ఎన్నిక చెల్లదని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. పిటిషన్‌పై విచారణను జులైకి వాయిదా వేసింది.ఆదిలాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి భారాస ఎమ్మెల్సీగా 2022లో దండె విఠల్ ఎన్నికయ్యారు. అయితే, తాను నామినేషన్ ఉపసంహరించుకోలేదని, తన సంతకాలు ఫోర్జరీ చేశారని కాంగ్రెస్ నేత పాతిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి అప్పట్లోనే హైకోర్టును ఆశ్రయించారు. విఠల్ ఎన్నిక చెల్లదంటూ ప్రకటించాలని కోర్టును కోరారు. ఫోర్జరీని తేల్చేందుకు పత్రాలను కేంద్ర ఫోరెన్సిక్ లేబొరేటరీకి పంపించాలని కోరారు. అనంతరం దీనిపై ఇరుపక్షాల వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం.. విఠల్ ఎన్నికను రద్దు చేస్తూ తీర్పు వెల్లడించింది. తాజాగా సుప్రీంకోర్టు స్టే ఇవ్వడంతో దండె విఠల్‌కు ఊరట లభించింది.

# స్థానిక సమరంపై నేతల వ్యూహం

**- వర్గపోరు లేకుండా కాంగ్రెస్ కసరత్తు - ఉమ్మడి జిల్లాలో 1,740 జీపీలు, 72 మండలాలు**

**వరంగల్,మే17:** పార్లమెంట్ఎన్నికల పోలింగ్ ముగియడంతో ఇక అందరి దృష్టి స్థానిక సమరంపై పడింది. జూన్‌లో ఎంపీ ఎన్నికల ఫలితాలు వచ్చాక స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎన్నికల మెటీరియల్, అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,740 గ్రామ పంచాయతీలు, 72 మండలాలు ఉన్నాయి. ఇప్పుడున్న రిజర్వేషన్ల ప్రకారంగానే ఎన్నికలు జరుగుతాయని ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది.

కొత్త చట్టం ప్రకారం రెండు టర్మ్‌ల వరకు ఒకటే రిజర్వేషన్లు ఖరారు చేశారు. మొదటి టర్మ్‌కు సంబంధించి ఫిబ్రవరిలో పంచాయతీల పాలన ముగియగా, జూలైలో జిల్లా పరిషత్ల పాలకవర్గాల పదవీ కాలం ముగుస్తుంది. కాబట్టి జూన్‌లో ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. పంచాయతీ వార్డులు మొదలు జడ్పీ చైర్మన్ స్థానం వరకు ఇప్పుడున్న రిజర్వేషన్లే యథావిధిగా కొనసాగనున్నాయి. అయితే, అసెంబ్లీ ఎన్నికల టైంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్తగా కొన్ని మండలాలు ప్రకటించింది. వీటి విషయంలో కాంగ్రెస్ సర్కార్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది. ఇవి మినహా ఇతర స్థానాల రిజర్వేషన్లలో ఎలాంటి మార్పు ఉండదు. నేరుగా ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసి, వారం, పదిరోజు ల్లో ఎన్నికల ప్రచారం, నామినేషన్ల ప్రక్రియ ముగించాలని భావిస్తోంది. ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించి, కొద్ది రోజుల తేడాతో సర్పంచ్ఎన్నికలు నిర్వహిస్తే రాజకీయంగా ఎలాంటి సమస్యలు ఉండవని ప్రభుత్వం ఆలోచన చేస్తోందని అధికారులు చెబుతున్నారు. దీని వల్ల మెజార్టీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోవడమే కాకుండా వలసొచ్చిన నేతలతో వర్గపోరు తలెత్తకుండా ఉంటుందని జిల్లా మంత్రులు అభిప్రాయపడుతున్నారు. కష్టపడ్డ నేతలకే లోకల్‌బాడీ ఎన్నికల్లో ప్రియార్టీ ఇచ్చేందుకు జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి ఇప్పటికే బంపర్ఆఫర్ ప్రకటించారు.

ఎంపీ ఎన్నికల్లో మెజార్టీ సాధించి పెట్టిన స్థానిక లీడర్లకే ప్రాధాన్యత ఇస్తామన్నారు. పైగా వాళ్ల ఎన్నికల ఖర్చు కూడా తానే భరిస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఎంపీ ఎన్నికల్లో జడ్పీ చైర్మన్, జడ్పీటీసీ, సర్పంచ్ పదవులపై ఆశలు పెట్టుకున్న వారంతా ఎంపీ ఎన్నికల్లో కష్టపడ్డారు. నల్గొండ నియోజకవర్గంలోని తిప్పర్తి మండలంలో 80 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. ఇక్కడి నుంచే ప్రస్తుత జడ్పీటీసీ పాశం రాంరెడ్డి వచ్చేసారి జడ్పీ చైర్మన్ సీటు ఆశిస్తున్నారు. దీనిలో భాగంగానే తిప్పర్తి క్లాక్ టవర్ జంక్షన్అభివృద్ధికి రూ.5 కోట్ల నిధులు కూడా మంజూరు చేయించారు. అదే విధంగా కనగల్మండల జంక్షన్ అభివృద్ధికి మరో రూ.5 కోట్లు మంత్రి కోమటిరెడ్డి మంజూరు చేయించారు. ఇలా లోకల్బాడీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తిరుగులేకుండా ఉండేందుకే ఇప్పటి నుంచే అభివృద్ధి పనులపైనే ఫోకస్ పెట్టారు. ఎంపీ ఎన్నికల్లో డబుల్ డిజిట్ స్థానాలు కైవసం చేసుకుంటామని కాంగ్రెస్ పార్టీ ధీమా వ్యక్తం చేస్తోంది. అదే జోష్తో స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే మళ్లీ ఐదేళ్ల వరకు ఎన్నికలు ఉండవని భావిస్తోంది. ఈ ఏడాది చివరి నాటికి మున్సిపాలిటీ, సహకార సంఘాల ఎన్నికలు కూడా పూర్తవుతాయి. అంతకంటే ముందే జరిగే గ్రామ పంచాయతీ, జిల్లా పరిషత్ ఎన్నికలను కాంగ్రెస్ పక్కాగా ప్లాన్ చేస్తోంది. అసెంబ్లీ, పార్లమెంట్ఎన్నికల టైంలో బీఆర్ఎస్ నుంచి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరారు. వీళ్లలో చాలా మంది పాత కాంగ్రెస్ లీడర్లతోపాటు కొత్తగా బీఆర్ఎస్ నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధులూ ఉన్నారు. వలసనేతలు, కరుడుగట్టిన కాంగ్రెస్ లీడర్ల మధ్య స్థానిక ఎన్నికల్లో విభేదాలు తలెత్తకుండా ఇప్పటినుంచే జాగ్రత్త పడుతున్నారు. పంచాయతీ, జడ్పీ ఎన్నికలకు కలిపి ఒకటే సారి ఎన్నికల నోటిఫికేషన్ ఇస్తే ప్రత్యర్థులకు ఛాన్స్ ఉండదని, పైగా లోకల్‌బాడీలను హస్తగతం చేసుకునేందుకు మార్గం సులువుగా ఉంటుందని కాంగ్రెస్ భావిస్తోంది.

## బేస్ బాల్ అంతర్జాతీయ పోటీలో
## కొండ్ర సుమిత్ రెడ్డికి పతకం



**గొల్లపల్లి మే 17 (ప్రజా మంటలు)**
గొల్లపల్లి మండలంలోని వెంగలాపూర్ గ్రామానికి చెందిన కొండ్ర గంగారెడ్డి మంగ దంపతుల కుమారుడు సుమిత్ రెడ్డి అంతర్జాతీయ బేస్ లెవెల్ వాల్బాల్ పోటీల్లో పథకం సాధించడంపై మాజీ సర్పంచ్ బాల భక్తుల అనిత కిషన్ అభినందించారు.

# మానవత్వం మరచిన తనయులు

**- ఆస్తి పంపకాల్లో తేడాతో రెండ్రోజులు - తల్లి దహన సంస్కారాలు నిలిపివేత**

**- చివరకు పంచాయితీ తెగడంతో దహనం - సూర్యాపేట జిల్లాలో కలచివేసిన ఘటన**

**సూర్యాపేట,మే17** మానవత్వం మంట కలిసిపోతుంది. మానవ సంబంధాలు, విలువలు రోజురోజుకు దిగజారుతూ అంతరించిపోతున్నాయి. కుటుంబ సభ్యుల మధ్య ఒకప్పుడు ప్రేమానురాగాలు ఉండేవి. రాను రాను డబ్బుపై వ్యామోహం పెరిగి బంధుత్వాలు తగ్గుకుంటూ వస్తున్నాయి. ఆస్తి పాస్తులు ఉంటే చాలు తల్లిదండ్రులు కూడా అవసరం లేదని రుజువు చేస్తున్న ఘటనలు చూస్తున్నాం. తల్లిదండ్రులు తమ బిడ్డలను ఎంతో ప్రేమానురాగాలతో పెంచి పెద్ద చేస్తారు. కానీ చివరికి అలాంటి తల్లిదండ్రులని పట్టించుకోని దీన స్థితి నెలకొంది. బంగారం, డబ్బుల కోసం చివరకు చనిపోయిన తల్లి అంత్యక్రియలు నిర్వహించకుండా రెండు రోజులు రోజులు ఆపిన ఘటన సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలోని కందులవారి గూడెం గ్రామంలో వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.కందులవారిగూడేనికి చెందిన వేము వెంకటరెడ్డి, లక్ష్మమ్మ (80) దంపతులకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలున్నారు. గతంలోనే లక్ష్మమ్మ భర్త వెంకటరెడ్డి, చిన్న కుమారుడు కూడా చనిపోయారు . దీంతో నేరేడుచర్లలో ఉంటున్న చిన్న కుమార్తె వద్ద గత ఐదేళ్లుగా లక్ష్మమ్మ ఉంటుంది. లక్ష్మమ్మ ఇటీవల కాలు జారి కింద పడింది. దాంతో ఆమెను మిర్యాలగూడలోని ఓ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు . ఆమె పరిస్థితి విషమించడంతో ఇంటికి తీసుకెళ్లండని డాక్టర్లు సూచించారు. దీంతో లక్ష్మమ్మను ఆక్సిజన్ సపోర్ట్‌తో చిన్నకుమార్తె తన ఇంటికి తీసుకెళ్లింది. బుధవారం రాత్రి 9 గంటలకు ఇంటి ముందు ఉన్న వెంచర్ వద్ద అంబులెన్స్ వచ్చి ఆగింది. ఈలోగా లక్ష్మమ్మ కుమారుడు అక్కడికి చేరుకుని.. పెద్దమనుషులతో పంచాయితీ పెట్టించారు. లక్ష్మమ్మను కందులవారిగూడెం తీసుకెళ్తానని చెప్పడంతో.. మిగతా కూతుళ్లు ఆస్తి పంపకాలు తేలే వరకు అంబులెన్స్ కదిలేది లేదని పట్టుపట్టారు. చివరకు రాత్రి 11 గంటల సమయంలో లక్ష్మమ్మ కన్నుమూశారు. మృతదేహాన్ని కందులవారిగూడెం తరలించినా కొడుకు కూతుళ్ల పంచాయితీ మాత్రం ఆగలేదు. లక్ష్మమ్మ గతంలో రూ.21 లక్షల వరకు పలువురికి అప్పులిచ్చారు. ఆమె ఒంటిపై 20 తులాల బంగారు ఆభరణాలున్నాయి. అయితే లక్ష్మమ్మ వైద్య ఖర్చులు భరించిన చిన్నకూతురికి రూ.21 లక్షల్లోంచి రూ.6 లక్షలు ఇవ్వాలని ఒప్పందం చేసుకున్నారు. మిగిలిన రూ.15 లక్షలకు సంబంధించిన పేపర్లను కుమారుడికి అప్పజెప్పారు. 20 తులాల బంగారు ఆభరణాలను ముగ్గురు కూతుళ్లు పంచుకున్నారు. అంతా అయిపోయిందిలే అనుకుంటున్నా సమయంలోనే కుమారుడు కొత్త పేచీ పెట్టాడు. తాను అంత్యక్రియల ఖర్చు భరించలేనని, తనకు డబ్బులిస్తేనే తలకొరివి పెడతానన్నాడు. శుక్రవారం ఉదయం పెద్ద మనుషులు అంత్యక్రియల ఖర్చుకు రెండు లక్షలు ఇప్పియడంతో ఆ పంచాయితీ కొలిక్కి వచ్చింది. తర్వాత ఆమె అంత్యక్రియలను నిర్వహించారు.

# ఎన్నికల్లో మళ్లీ విజయం సాధించబోతున్నాం

**- పాజిటివ్ ఓటు కారణంగానే పోలింగ్ శాంలో పెరుగుదల**

**- ఎన్నికల హింసకు కారణం ఇసి వైఫల్యమే - కుప్పంలోనూ గెలుపు వైసిపిదే అన్న సజ్జల**

**అమరావతి,మే17:** ఎన్నికల్లో విజయంపై తాము పూర్తి విశ్వాసంతో ఉన్నామని.. గత ఎన్నికల్లో గెలిచిన సీట్ల కంటే ఈ సారి ఎక్కువే గెలుస్తామని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. అంతేకాదు కుప్పంలోనే వైకాపా విజయం సాధిస్తోందని అన్నారు. శుక్రవారం ఆయన తాడేపల్లిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. ఓటింగ్ సరళిని చూసి ప్రభుత్వ వ్యతిరేక ఓటు అనుకోవద్దన్నారు. చంద్రబాబుకు ఆయన మీద ఆయనకే నమ్మకం లేదు. చంద్రబాబు పూర్తిగా నెగిటివ్ క్యాంపెన్ చేశారు. జగన్ ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్లింది. కుప్పంలోనూ వైఎస్సార్‌సీపీ గెలవబోతోంది. కుట్రపూరితంగా కేంద్రం సహాయంతో కొందరు అధికారులను తప్పించారు. ల్యాండ్ టైట్లింగ్‌పై చంద్రబాబు అర్థంలేని ఆరోపణలు చేశారు. చంద్రబాబు హామీలపై ప్రజలకు నమ్మకం లేదని సజ్జల పేర్కొన్నారు. పోలీసులు పెద్దారెడ్డి ఇంట్లోని సీసీటీవీలు ధ్వంసం చేయడం అన్యాయం. పెద్దారెడ్డి ఇంట్లో పోలీసులు సీసీ కెమెరాలు ధ్వంసం చేయడమేంటి?. దాడిపై ఈసీకి ఫిర్యాదు చేస్తున్నాం అని సజ్జల చెప్పారు. కౌంటింగ్‌లో అక్రమాలు జరుగుతాయని అనుకోవడం లేదు.. కౌంటింగ్‌లో అక్రమాలు జరిగితే ఎదుర్కొంటాం. ఈసీ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరుతున్నాం. ఇప్పటికేనీ ఈసీ తప్పు సరిదిద్దుకుంటే మంచిందని సజ్జల హితవు పలికారు. మళ్లీ అధికారంలోకి వస్తున్నాం. సాంప్రదాయ ఓటు బ్యాంక్ మావైపు ఉంది. మాకు కాన్ఫిడెన్స్ ఉంది, ఓవర్ కాన్ఫిడెన్స్ లేదు. ప్రజలు ఓటింగ్ లో పాల్గొన్న తీరు చూస్తుంటే మళ్ళీ విజయం సాధిస్తాం. పోలింగ్ పర్సంటేజ్ పెరిగితే మేము ఓడిపోతామన్న భ్రమలో టీడీపీ ఉంది. మాపై వ్యతిరేకత ఉన్న వర్గాలు ఎక్కడా లేవు. ప్రజలు నమ్మటం లేదని చంద్రబాబు సూపర్ సిక్స్ గురించి ప్రచారం చేసుకోలేదు. వివేకా హత్య, ల్యాండ్ టైట్లింగ్ గురించి తప్ప తాను



చేసే మంచి గురించి ఎక్కడైనా చెప్పాడా. సీఎం జగన్ చేసిన అభివృద్ధి సంక్షేమం అభివృద్ధి చూసి ఓటు వేయాలని అడిగారు. నన్ను చూసి నేను చేసిన మంచి చూసే ఓటు వేయాలని జగన్ అడిగారు. టీడీపీ గెలవడానికి ఉన్న ఒక్క కారణమైనా చెప్పగలరా అంటూ సజ్జల ప్రశ్నించారు. చంద్రబాబు కూడా ఎన్నికల్లో విజయం సాధిస్తామని చెప్పలేక పోతున్నారు. టీడీపీ కూటమి వలనే పోలింగ్ లో హింస జరిగింది. వారు చెప్పిన అధికారులే హింసకు కారణమయ్యారు. ఇప్పుడు వాళ్లనే ఈసీ తొలగించి చర్యలు తీసుకుంది. ఇంకా తొలగించాల్సిన వాళ్ళు కొందరు ఉన్నారు. పోలింగ్‌కు ముందు అడ్డగోలుగా అధికారుల బదిలీ చేశారు. అల్లర్లు జరిగాయి అంటే ఈసీ విఫలం అయ్యినట్లే. వీటి వెనుక చంద్రబాబు పాత్ర ఉన్నట్లే. ఈ-ఆఫీసు అప్ గ్రేడ్ చేస్తుంటే గవర్నర్‌కు లేఖలు రాస్తున్నారు. రికార్డులు మాయం అవుతున్నాయని పిచ్చి పిచ్చి లేఖలు రాస్తున్నారని సజ్జల ధ్వజమెత్తారు. తాడిపత్రిలో పెద్దారెడ్డి ఇంట్లో పోలీసులే సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు. ల్యాండ్ టైట్లింగ్ గురించి ఎన్నికల తరువాత టీడీపీ ఎందుకు మాట్లాడటం మానేసింది?. ల్యాండ్ టైటలింగ్ అమలు చేయాలని నీతి అయోగ్ చెప్పింది. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగాలంటే పోలీసు అబ్జర్వర్ దీపక్ మిశ్రాను తొలగించాలి. టీడీపీ కొంతమంది పోలీసులను తమ ఏజెంట్లుగా మార్చుకుంది. ప్రశాంతంగా కౌంటింగ్ జరగాలని కోరుకుంటున్నాం. ఎన్నికల కమిషన్ బాధ్యతాయుతంగా ఉంటే ఇంత విధ్వంసం అల్లర్లు జరిగేవి కావు. ఒక వర్గానికి కొమ్ము కాస్తున్న వారిని పక్కన పెట్టాలని ఎన్నికల కమిషన్‌ను కోరుతున్నాం. కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు అన్ని ప్రాంతాల్లోనూ గెలుస్తాం. జగన్ పాలనలో లబ్ది పొందని వర్గాలు, న్యాయం జరగని కుటుంబం అంటూ ఏమీ లేవు. అందరికీ మేలు చేసినందునే భారీ సీట్లతో గెలవబోతున్నాం అని సజ్జల ధీమా వ్యక్తం చేశారు. కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు వైసీపీనే గెలుస్తుందని ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. తమ పార్టీ గెలుపుపై తమకు పూర్తి నమ్మకం ఉందని పేర్కొన్నారు. తమ గెలుపుపై కాన్ఫిడెన్స్ ఉంది కానీ.. ఓవర్ కాన్ఫిడెన్స్ లేదని స్పష్టం చేశారు. పోలింగ్ శాతం పెరిగితే గెలుస్తామన్న భ్రమలో టీడీపీ ఉందని విమర్శించారు. చంద్రబాబు అప్పుడే అధికారంలోకి వచ్చినట్లు భావిస్తున్నారని తెలిపారు.

# అకాల వర్షంతో అన్నదాతల కుదేలు

**- ఉమ్మడి జిల్లాలో భారీగా పంటనష్టం - తడిసి ముద్దయిన కల్లాల్లో ఆరబోసిన ధాన్యం**

**వరంగల్,మే17:** తెలంగాణ వ్యాప్తంగా అకాల వర్షాలకు రైతులు లబోదిబో మంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం తడిసిపోవడంతో కొనేవారు రాక ఆందోళన చెందుతున్నారు. పంట వేసిన దగ్గర నుంచి పంట చేతికి వచ్చేవరకు, కంటిమీద కునుకు లేకుండా కష్టపడుతున్న రైతన్న.. తీరా పంట చేతికి వచ్చాక దళారుల దగ్గర పోరాడలేక ఓడిపోతున్నాడు. తాజాగా అకాల వర్షాలు రైతన్నను నిండా ముంచేస్తున్నాయి. చేతికందొచ్చిన పంట కళ్లెదుటే మట్టిపాలు కావడంతో గుండెలు బాదుకుంటు న్నారు. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దవడంతో భోరుమంటున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెద్దఎత్తున ధాన్యం వర్షార్పణమైంది. వానల నుంచి పంటను కాపాడుకోవడం కోసం పడరాని పాట్లు పడుతున్నారు రైతులు. దంచికొడుతున్న వానలు అన్నదాతలను నట్టేట ముంచాయి..నోటి కాడి బుక్క నీటిపాలడంతో రైతన్నలు దిగులుతో తలలు పట్టుకుంటున్నారు. కళ్ళాల్లో ఆరబోసిన ధాన్యం వరదల్లో కొట్టుకుపో తుంటే, రైతన్న గుండె చెరువు అవుతుంది. వరంగల్ ఉమ్మడి జిల్లాలో గతవారం రోజుల నుండి కురుస్తున్న వడగండ్ల వానల ప్రభావంతో వివిధ పంటలకు ఊహించిన విధంగా నష్టం వాటిల్లింది. వేసవిలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం అన్నదాత గుండె చేరువయ్యేలా చేసింది. పగబట్టిన ప్రకృతి రైతులు కుమిలి పోయేలా చేస్తోంది. చేతికి వచ్చిన పంట అమ్ముకునే సమయంలో దరిద్రపుగొట్టు వర్షాలు అన్నదాతలను నట్టేట ముంచాయి. వడగండ్ల వానలు రైతులకు ఊహించని విధంగా నష్టాన్ని కలిగిస్తున్నాయి. వడగండ్ల వానల ప్రభావంతో వరి పంటకు ఊహించని విధంగా నష్టం వాటిల్లింది..వరంగల్, ములుగు, మహబూబాబాద్, భూపాలపల్లి, జనగామ జిల్లాల్లో వరి పంట మొత్తం వర్షార్పణమైంది. ఇప్పటికే కోతలు పూర్తయి అమ్మకం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.. చాలా ప్రాంతాల్లో కల్లాల్లో దాన్యం ఆరబోసుకొని అమ్ముకోవడానికి ఎదురుచూస్తున్నారు. మరి కొంతమంది రైతులు రోడ్లపై దాన్యం ఆరబోసుకుని అమ్ముకోవడానికి కళ్ళలో వత్తులు వేసుకుని ఎదురు చూస్తున్నారు. వడగండ్ల వానల నుండి పంటను కాపాడుకోవడం కోసం పడరాని పాట్లు పడుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల కారణంగా ధాన్యం కొనుగోలులో కొంత అంతరాయం ఏర్పడింది. ఆ జాప్యం ఇప్పుడు రైతుల గుండె చేరువయ్యేలా చేస్తోంది. చేతికొచ్చిన పంట వర్షార్పణం అయిపోతుండడంతో రైతులు తల్లడిల్లిపోతున్నారు.

## బాసటగా నిలుస్తున్న భరోసా కేంద్రం

**వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**



**వరంగల్,మే17 :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ భరోసా కేంద్రం లైంగిక దాడులకు గురైన బాధితులను అక్కున చేర్చుకోని వారికి అండగా నిలుస్తోందని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదైన లైంగిక దాడుల కేసుల్లో బాధితులు వైద్య, వసతి, ఆర్థిక, న్యాయపరంగా సహకారం అందిస్తున్న భరోసా కేంద్రంలో ఈ కేసుల్లోని నిందితులకు శిక్షలు పడేవిధంగా భరోసా కేంద్రం అధికారులు, సిబ్బంది పనితీరును అభినందిస్తూ తెలంగాణ మహిళా భద్రత విభాగం అడిషినల్ డైరక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ షీకాగోయెల్ ప్రశంస పత్రాలను జారీచేసారు. వరంగల్ పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా భరోసా కేంద్రం అధికారులు, సిబ్బందికి దీనిని అందజేసారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ముందుగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ భరోసా కేంద్రం సిబ్బందిని అభినందించారు. లైంగిక దాడులకు పాల్పడిన నిందితులకు శిక్షలు పడటంలో భరోసా కేంద్రం సిబ్బంది పనితీరు అభినందనీయమని, ఈ కేంద్రం సిబ్బంది ఇప్పటి వరకు 24కేసుల్లో బాధితులకు బాసటగా నిలవడంతో పాటు నిందితులకు కోర్టు శిక్షలు విధించడంలో కీలకంగా నిలిచారు. అలాగే 335 బాధితులకు మొత్తం కలిపి ఒక కోటి ఇరువై లక్షల రూపాయలను పరిహారం క్రింద అందజేయడంతో పాటు మరో ఎనిమిది మందికి మొత్తం 14 లక్షల16 వేల రూపాయలను పరిహారాన్ని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటి అందజేసారని పోలీస్ కమిషనర్ తెలిపారు. ప్రశంస పత్రాలు అందుకున్న వారిలో భరోసా కేంద్రం ఇన్స్‌స్పెక్టర్ సువర్ణ, ఎస్.ఐ శ్రావణి, ఇతర సిబ్బంది నీరజ, నవ్య, సాగరిక, సుమలత,రజిత,పవిత్ర, మౌనిక వున్నారు.

## హనుమకొండ డిటిడిఓ ప్రేమకళ రెడ్డి అవినీతి

**అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలి**

**ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందచేత**



**వరంగల్,మే17:** గిరిజన అభివృద్ధి అధికారి ప్రేమకళ అవినీతి అక్రమాలపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ నర్సింహారెడ్డికి మెమోరండం ఇవ్వడం జరిగింది. సందర్భంగా అజ్మీర వెంకట్ మాట్లాడుతూ హనుమకొండ జనగామ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ప్రేమ కళ గత మూడు సంవత్సరాల క్రితం వచ్చినప్పటినుండి గిరిజన సంక్షేమ శాఖను భ్రష్టు పట్టించిందన్నారు. అక్రమార్జనే ధ్యేయంగా పనిచేస్తూ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీస్ దగ్గర నుండి మధ్యవర్తి ఒక వార్డెన్ ద్వారా లక్షల రూపాయలు వసూలు చేస్తూ, ఇబ్బందులకు గురి చేస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. జనగామ హన్మకొండ జిల్లాలో పనిచేస్తున్నటువంటి ఒక్కొక్క వార్డులకు రెండు మూడు హాస్టల్లో ఇన్చార్జి బాధ్యతలు అప్పగిస్తూ వారి దగ్గర నుండి హాస్టల్ లో ప్రతినెల డైట్ బిల్స్ లో 20శాతం తీసుకొని పిల్లల హాజరు శాతం 100 వేసుకోండి అని వార్డెన్లకు చెపుతూ కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించినట్లు ఆరోపించారు. అలాంటి ప్రేమకళ పై ఏసీబీ విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా కొంతమంది వార్డెన్లను ప్రిన్సిపాల్ లను హనుమకొండ లో ఉన్న డి టి డి ఓ ఆఫీస్ లో ఖాళీగా కూర్చోబెట్టి జీతాలు ఇస్తున్నారు. అన్ని అంశాలపై సమగ్రమైన విచారణ జరిపించాలని ప్రేమకళపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసారు. లేని పక్షంలో ఎన్ హెచ్ పి హెచ్ ఆధ్వర్యంలో దశలవారీగా పోరాటాలు ఆందోళనలు చేపడతామని హెచ్చరిక చేసారు.

## అమేథీ, రాయబరేలీల్లో గెలుస్తున్నాం

**కాంగ్రెస్ నేత కెసి వేణుగోపాల్ ధీమా**




**అమేథీ,మే17:** ఈ లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' బ్లాక్ అత్యధిక స్థానాలను సొంతం చేసుకుంటుందని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి వేణుగోపాల్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. 'మేము రాయబరేలి, అమేథీ రెండు స్థానాల్లో గెలుస్తాము. మీరు ఎక్కడికెళ్లినా ప్రజల మూడ్‌ని గమనిస్తే.. 'ఇండియా' బ్లాక్‌కి అనుకూలంగా ఉంది.' అని ఆయన అన్నారు. బిజెపి 150 సీట్లకు మించి గెలవదని రాహుల్ అనడాన్ని మీడియా ప్రతినిధులు వేణుగోపాల్‌ని ప్రశ్నించగా.. 'రాహుల్ దేశవ్యాప్తంగా పర్యటించారు. ఆయనకు ప్రజల పల్స్ తెలుసు. అందుకే బిజెపికి అంతకన్నా ఎక్కువ సీట్లు రావు అని రాహుల్ అంచనా.' అని ఆయన అన్నారు. ÷ూగా, అమేథీ నుంచి ఇండియా బ్లాక్ అభ్యర్థి కె.ఎల్ శర్మ పోటీ చేస్తున్నారు. ఆయన విజయాన్ని కాంక్షిస్తూ.. సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్, కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ప్రచార ర్యాలీ నిర్వహించారు.

## ప్రతిపక్ష నేతల ప్రసంగాల్లో
## అభ్యంతరకర పదాలు

**ఎన్నికల ప్రసంగం నుంచి తొలగించిన ప్రసారభారతి**

న్యూఢిల్లీ,మే17(ఆర్ఎన్ఎ): ప్రతిపక్ష నేతల ప్రసంగాల్లోని పదాలను దూరదర్శన్, ఆకాశవాణిలు తొలగించాయి. సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకుడు జి.దేవరాజన్ ప్రసంగాల్లోని కొన్ని పదాలను ఇవి తొలగించాయి. 'మత నియంతృత్వం, క్రూరమైన చట్టాలు, ముస్లింలు' వంటి పదాలను వారి ప్రసంగాల నుండి తీసివేశారు. ఢిల్లీలోని దూరదర్శన్ స్టూడియోలో సీతారాం ఏచూరి ఇచ్చిన టెలివిజన్ ప్రసంగం నుండి రెండు పదాలను తొలగించగా, 'దివాలా' ప్రభుత్వం పదాన్ని 'వైఫల్య' ప్రభుత్వంగా మార్చారు. కాగా, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకుడు జి.దేవరాజన్ ప్రసంగంలో నుండి 'ముస్లింలు' అనే పదాన్ని తొలగించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా, ఆకాశవాణి, దూరదర్శన్‌లలో కేటాయించిన ప్రసార సమయంలో చేసిన ప్రసంగాలలో ఈ చర్య తీసుకోబడింది. అదే సమయంలో ఎన్నికల సంఘం ప్రవర్తనా నియమావళి ప్రకారం చర్యలు తీసుకున్నామని, ఇంతకుముందు కూడా ఇలాంటి చర్యలు చేపట్టామని ప్రసార భారతి అధికారులు వివరించారు. ఈ చర్యపై వివిధ వర్గాల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# మిత్రుని సాయం



నరసింహపురంలో రుద్రుడు ,శాంతుడు అనే మిత్రులు ఉండేవారు. రుద్రుడు ఎప్పుడూ కోపాన్ని ప్రదర్శించేవాడు. శాంతుడు అతన్ని ఊరడిస్తూ ఉండేవాడు. రుద్రుడు ఇంట్లో కూడా చీటికిమాటికి కోపం తెచ్చుకునే వాడు .కానీ అతని భార్య ఆనందమ్మ అతనిని చాలా బుజ్జగించి కోపాన్ని పోగొట్టేది .ఒకసారి ఆమె రుద్రుని కోపం గురించి శాంతునికి చెప్పి ఆ కోపం పోయే మార్గం చూపించమన్నది .అప్పుడు శాంతుడు "సమయం రానీ సోదరీ! వాడే శాంతంగా ప్రవర్తిస్తాడు" అని అన్నాడు.

ఇలా ఉండగా ఒకసారి ఆ ఊరికి ఒక మహాత్ముడు వచ్చాడని తెలిసింది. శాంతుడు రుద్రునితో " మిత్రమా! ఈ ఊరికి ఒక మహాత్ముడు వచ్చాడట. అతడు చాలా మహిమలు కలవాడట. అతడు ఎటువంటి వారికైనా అయినా తాము అనుకున్నది లభించేలా చేస్తాడట. అందరూ అంటుంటే విన్నాను. నీవు ఆయన వద్దకు వెళ్లి సలహా అడిగి నీ కోపాన్ని పోగొట్టుకోవడం మంచిది. అవసరమైతే నేను కూడా నీతోటి ఆయన వద్దకు వస్తాను " అని అన్నాడు. అందుకు రుద్రుడు మొదటగా ఒప్పుకోలేదు. కానీ మిత్రుడి బలవంతం పై ఆ మహాత్ముని వద్దకు బయలుదేరాడు. శాంతుడు ఆ మహాత్మునికి తన మిత్రుని కోపం పోగొట్టవలసిందని విజ్ఞప్తి చేశాడు. అందుకు ఆ మహాత్ముడు "అది అసాధ్యం . ఈ కోపాన్ని మాకే జయించడం సాధ్యం కాదు. దానికి ఏ మందులు మాకులు మంత్రాలు పనిచేయవు "అని చెప్పాడు. అది విన్న రుద్రుడు "చూశావా !నేను చెప్పినట్టే జరిగింది .ఆ కోపాన్ని ఆపడం ఎవరి తరం కాదు" అని ఆ మహాత్ముని ముందరే అన్నాడు.

అప్పుడు ఆ మహాత్ముడు" ఔనయ్యా ! నీవు చెప్పింది నిజమే .అయితే కోపం ఎవరికీ మంచిది కాదు. అందుకే తన కోపమే తన శత్రువని పెద్దలు అన్నారు. అయినా నేను చెప్పినట్టు నడుచుకున్నావంటే నీకు కోపం పోతుంది "అని అన్నాడు. అందుకు రుద్రుడు సంతోషించి "మహాత్మా !మీరు ఏది చెప్పినా చేస్తాను "అని అన్నాడు ."అయితే నీ మిత్రుని ముందుగా ఇంటికి వెళ్ళమని చెప్పు" అని అన్నాడు ఆ మహాత్ముడు. రుద్రుడు అలాగే శాంతుని ఇంటికి వెళ్ళమని చెప్పాడు. అతడు వెళ్లిపోయాడు.

ఆ మహాత్ముడు రుద్రునితో "నీవు మంచిగా పని చేస్తే ఎవరైనా నీకు కొలువును ఇస్తారు .నీవు రేపటి నుండి మూడు రోజులు ఎవ్వరు పలకరించిననూ, నిన్ను ఎవ్వరూ తిట్టిననూ, కవ్వించిననూ నీవు మాట్లాడకూడదు. నీవు నా మాటను గౌరవించు . నీవు అలా నేను చెప్పినట్టు చేయకుంటే నీకు ఆపద సంభవిస్తుంది "అని అన్నాడు. ఆపద అనేసరికి రుద్రుడు భయపడి "సరే మహాత్మా! మీరు చెప్పినట్లే చేస్తాను. నన్ను దూషించినప్పటికినీ నేను మాట్లాడను .మూడు రోజులు ఇక నేను మౌనవతం దాలుస్తాను "అని అన్నాడు. ఆ మూడు రోజులు ఎంతోమంది రుద్రుని పలకరించారు. దూషించారు .కవ్వించారు . అయినా రుద్రుడు మాట్లాడలేదు. మూడు రోజులైన పిదప ఆ సాధువు "రుద్రుడా! నీవు కోపాన్ని జయించావు. ఈ మూడు రోజులు ఒక్కడిని నీవు ఏమీ అనలేదు. నిన్ను దూషించినప్పటికినీ నీవు భరించావు తప్ప ఇతరులను పల్లెత్తు మాటను కూడా నీవు అనలేదు" అని ప్రశంసించాడు.

అప్పుడు రుద్రుడు " మహాత్మా! నాకు ఇప్పుడు కోపాన్ని ఎలా చేయించాలో తెలిసింది. మౌనమే దానికి పరిష్కారం" అని అన్నాడు. " ఇంకేమిటి? ఈ సమస్యకు పరిష్కారాన్ని నీవే కనుక్కున్నావు కదా! ఇకనుండి ఎవ్వరు ఏమన్నా నీవు పట్టించుకోకు. తద్వారా నీ కోపం అదుపులో ఉంటుంది. కోపం వల్ల నీ ఆరోగ్యం దెబ్బతింటుంది. అర్థమైందా!" అని అన్నాడు. అప్పుడు రుద్రుడు ఆ సాధువుకు నమస్కారం చేసి ఇంటిదారి పట్టాడు.

అతని మిత్రుడు శాంతుడే ఆ సాధువుకు రుద్రుని మొండితనం, కోపం గురించి మొత్తం చెప్పినట్లు రుద్రునికి తెలియదు. అంతేకాదు .అతడు ఆ మహాత్ముడు అని చెప్పిన సాధువు కూడా పొరుగు గ్రామంలోని శాంతుని మిత్రుడేనని రుద్రునికి తెలియదు .ఏదేమైనా కొద్దిరోజుల్లోనే రుద్రుని కోపం కాస్త పటాపంచలైపోయింది .ఆనందమ్మ అందుకు ఎంతో సంతోషించింది.

రచన: సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
ధర్మపురి. 9908554535




## కథల రచయితలకు ఆహ్వానం

గత రెండున్నర సంవత్సరాలుగా "ప్రజా మంటలు" జాతీయ దినపత్రికలో ప్రతిరోజూ ఒక పిల్లల కథను ప్రచురిస్తున్నవిషయం తెలిసిందే. రెండు తెలుగు రాష్ట్రాలలోని పేరున్న రచయితలతో పాటుగా, కొత్త రచయితలు, విద్యార్థులు కూడా తమ కథలను పంపుతున్నారు. ఒక రచన ప్రచురించడానికి కనీసం 20-30 రోజులు పడుతుందని గ్రహించండి. ప్రచురణ విషయంలో ఉత్తరప్రత్యుత్తరాలకు తావు లేదు. మీ రచనలను నెట్ బ్రౌజింగ్ చేసుకొని www.prajamantalu.com లో ప్రతి రోజు చదువుకోండి. మీరు కూడా మీ కథలను హామీ పత్రంతో, ఈమెయిల్ కు పంపండి.
mantalukathalu@gmail.com

# పాక్ ఆక్రమిత కాశ్మీర్‌పై తేల్చాల్సిందే

ఇంతకాలం కాశ్మీర్‌లో అణచివేత గురించి మాట్లాడిని నేతలు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో జరుగుతున్న ఆందోళనల గురించి మాట్లాడడం లేదు. 370 ఆర్టికల్ రద్దు చేయగానే గగ్గోలు పెట్టిన నేతలు పివోకె విషయంలో నోరు మెదపడం లేదు. నోట్లో విషం పెట్టుకున్న ఫరూక్ అబ్దుల్లా, మెమబూబా ముఫ్తీలు కూడా మాట్లాడడం లేదు. ఎందుకంటే వీరంతా పాక్ పన్నాగాలను ఆహ్వానించేవారు. వీరంతా పాక్ చర్యలను సమర్థించేవారు. ఆక్రమిత కాశ్మీర్లో దౌర్జన్యకాండ పెరిగిపోతోంది. అక్కడి ప్రజలు తట్టుకోలేక రోడ్లమీదకు వస్తున్నారు. మేం భారత్‌తోనే ఉంటామని ఎలుగెత్తి చాటుతున్నారు. పాక్‌లో ప్రభుత్వం మారినా పరిస్థితి
మారలేదనడానికి ఇది నిదర్శనం. ఇకపోతే కాశ్మీర్‌లో ఇంతకాలం రక్తపుటేరులు పారేవి. దేశంలో బాంబు దాడులు సహజంగా సాగేవి. కానీ 370 ఆర్టికల్ రద్దు తరవాత, కాశ్మీర్ అంతర్భాగం అయ్యాక అలాంటి హింస తగ్గింది. పాక్ ఆక్రమిత కాశ్మీర్ విషయంలో గత పాలకులు ఏనాడూ పట్టబట్టలేదు. ఎన్నో యుద్ధాల్లో పాక్ ఓడిపోయి మనముందు సలాం చేసినా పివోకెను వమనం వెనక్కి తీసుకోవాలన్న ఆలోచన రాలేదు. ఇంతజరుగుతున్నా కనీసం స్పందించని మాజీముఖ్యమంత్రులు ఫరూఖ్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీలు గతంలో మాత్రం కాశ్మీర్ ఫైల్స్‌పై అక్కసు వెళ్లగక్కారు. గతంలో ఎన్నో కిరాతకాలకు ప్రతిరూపంగా తీసిని సినిమా అది. ఇది నిజమన్న సంగతి ఈ ఇద్దరు సిఎంలకు బాగా తెలుసు. కాశ్మీర్‌లో ప్రత్యేక హోదాను అడ్డంపెట్టుకుని అక్కడ రాచరికం అనుభవించిన నేతలు వీరు. అయినా వీరిలో మార్పురాలేదనడానికి తాజా వారి స్పందనలే నిదర్శనం. కాశ్మీర్‌లో ఇప్పటికే 75శాతం పండిట్లను ఊచకోత కోసారు. ఉన్నవారు ఊరు విడిచి వెళ్లిపోయారు. దేశంలో ఎక్కడో ఓ చోట తలదాచుకుంటున్నారు. అయినా వారికి న్యాయం చేయాలన్న జ్ఞానం ఈ నేతలకు లేదు. కాశ్మీర్‌లో శాంతియుత పరిస్థితులు నెలకొనడం అత్యావశ్యకం. అక్కడి అమాయక ప్రజలు ఉగ్రమూకల కారణంగా జీవితాలు కోల్పోరాదు. వారు ఏ మతం వారైనా సామాన్యులే అన్న విషయం గుర్తించాలి. అందుకే ఇక కాశ్మీర్ విషయంలో తేలాల్సింది పాక్ ఆక్రమిత కాశ్మీర్ సమస్య మాత్రమే. దీనిని అంతర్జాతయ సమస్యను చేయడం ద్వారా పాక్ పీచమణచాలి. కాశ్మీర్‌పై నానాయాగీ చేస్తూ రాజకీయ పబ్బం గడుపుకుంటూ భారత్‌ను చికాకు పెట్టే పాక్ కుతంత్రాలకు దీటుగా జవాబివ్వాలి. పాక్ ఆక్రమిత కాశ్మీరీలు కూడా అక్కడ అణచివేతకు పోరాడుతున్నారు. తమను భారత్ కాశ్మీర్‌లో కలపాలని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. 370 ఆర్టికల్ రద్దు తరవాత పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ప్రజలు స్వచ్ఛందగా అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పారు. ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే కాశ్మీర్‌లో ప్రశాంత పరిస్థితులకు కృషి చేస్తూనే ఆక్రమిత కాశ్మీర్ స్వాధీనానికి అడుగులు వేయాలి. అలాగే దేశం యావత్తూ కేంద్రం తీసుకుంటున్న చర్యలు స్వాగతించాలి. కశ్మీర్ అంశంపై భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ స్వరాన్ని పెంచి, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ లక్ష్యంగా నినదించాలి. నిజానికి తమ అజెండా ఇక పాక్ ఆక్రమిత కాశ్మీర్ అని చెప్పడం ద్వారా సమస్యపై పాక్‌కు సవాల్ విసిరారు. ఇంతకాలం కాశ్మీర్ సమస్యను అడ్డుగా పెట్టి అరాచకం చేస్తున్న పాక్‌కు పివోకే ఆందోళనలు కనువిప్పు కలిగించాలి. ఉగ్రవాదాన్ని ఎగదోయడాన్ని ఆపనంత కాలం పాకిస్థాన్‌తో చర్చలు అసాధ్యమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పదేపదే స్పష్టం చేసి పాక్ కుతంత్రాలను ప్రపంచానికి తెలియచేసారు. ఒకవేళ పాక్‌తో చర్చలు జరపాల్సి వస్తే అవి పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) పైనే ఉంటాయని తేల్చి చెప్పాలి. ఇది కాక మరో అంశంపై సంప్రదింపులు ఉండబోవని కుండబద్దలు కొట్టాలి. ఉగ్రవాదం ద్వారా భారత్‌ను అస్థిరపరిచి విచ్ఛిన్నం చేయాలని పాక్ కుట్ర పన్నుతోందని ప్రపంచం యావత్తూ గుర్తించిన నేపథ్యంలో పాక్ ఆక్రమిత కాశ్మీర్ ఎజెండాగా పనిచేయాలి. 370' రద్దు తర్వాత ఇప్పుడు పీవోకే ప్రజలు భారత్‌లో విలీనం కావాలని కోరుకుంటున్నారు. పాక్ అక్రమ కబ్జా నుంచి పీవోకేకి విముక్తి కల్పించి, భారత్‌లో అంతర్భాగంగా మార్చాలన్న వారి కలను సాకారం చేయాలి. పీవోకే రాజధాని ముజఫరాబాద్‌ను మనం స్వేచ్ఛగా సందర్శించే రోజు రావాలని కోరుకుందాం. ఇదే క్రమంలో పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ప్రజల అణచివేతపై పోరాడాలి. అలాగే మన కాశ్మీర్‌లో అశాంతి రాజేస్తున్న ఉగ్రమూకలను చీల్చి చెండాడాలి. ఇదిలా ఉండగా.. జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదులను ఏకాకులను చేస్తున్నామని, దీంతో వారికి ప్రజలను తప్పుదోవ పట్టించే అవకాశం లేకుండా పోయిందని పోలీస్ అధికారులు అంటున్నారు. రాష్ట్రంలో సానుకూల దృక్పథంతో అభివృద్ధి జరుగుతోందని, ప్రజలు కూడా దీనిని అర్థం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. పరిస్థితులు ఏమాత్రం చేయి దాటిపోకుండా భద్రతా బలగాలు కృషి చేస్తున్నాయన్నారు. ఇంత జరుగుతున్నా పాక్ తన ప్రేలాపనలు ఆపడం లేదు. మొత్తంగా కశ్మీర్‌లో పరిస్థితులను చక్కది ద్దేందుకు గత నాలుగున్నరేళ్లుగా కేంద్రం తీసుకున్న చర్యలు విఫలం అయ్యేలా స్థానిక నేతలు, పాక్ ప్రేరేపిత సంస్థలు పనిచేస్తూ వచ్చాయి. తాజాగా మాజీ సిఎంల వ్యాఖ్యలు కూడా ఇందుకు నిదర్శనంగా చూడాలి. పాక్ ప్రత్యక్ష,పరోక్ష చర్యలతో కాశ్మీర్ శాంతిని అడ్డుకుంటోంది. ఈ దశలో ఇక గట్టి నిర్ణయంతో ముందుకు సాగడమే మంచిది. పాక్ తీరును నమ్మడానికి లేదు. అందుకే ఇక ఈ సమస్యను తీవ్రంగానే గుర్తించి ఇదే అవకాశంగా పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను భారత్‌లో అంతర్భాగంగా చేసే యత్నాలు ఆరంభిం చాలి. మరోమారు కాశ్మీర్‌లో వేలుపెట్టకుండా పాక్‌కు గట్టి బుద్ది చెప్పాలి. అలాగే కాశ్మీర్‌లో ఉగ్రమూకల ఏరివేతను మరింత సవాల్‌గా తీసుకోవాలి. అక్కడ ఉగ్రవాదులు కాలుపెట్టకుండా కఠినంగా వ్యవహరించాలి. ఉగ్రమూకలకు అండగా నిలుస్తున్న వారు ఎంతటి వారైనా బుద్ధి చెప్పాలి. స్థానికమప్రజల అండ లేకుండా చేయాలి. నాయకులైతే కోర్టు బోనులో నిలబెట్టాలి. మరింత ఉధృతంగా ఉగ్రవాదుల ఏరివేత ప్రారంభించాలి. వారికి ఆశ్రయం కల్పిస్తున్న వారిని గుర్తించి వారిని కూడా ఏరిపడే యాలి. పండిట్లు లేదా సామాన్య ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలి. వారికి అండగా నిలవాలి. అవసర మైన మేరకు భద్రత కల్పించాలి. అందుకు సంకల్పం తీసుకుని ముందుకు సాగాలి. ఈ విషయంలో రాజకీయాలను పట్టించుకోక పోవడం ఉచితం.

# చిరునవ్వులోని హాయి ...



(మే మాసం 'నవ్వుల దినోత్సవ సందర్భంగా వ్యాసం )

మనకు ఎవరైనా పరిచయస్తులు కనిపిస్తే మాటకుముందు చిరునవ్వు చిందిస్తాము.అందుకే అన్నాడు ఓ సినికవి చిరునవ్వులోని హాయి అని. నవ్వగలగడమే భోగం, నవ్వలేకపోవడుమే రోగం .నవ్వు ఆరోగ్యానికి చిరునామా! నవ్వు లేదా మందహాసం లేదా దరహాసం ఒక విధమైన ముఖ కవళిక. నవ్వులో ముఖంలోని వివిధ కండరాలు, ముఖ్యంగా నోటికి రెండువైపులా ఉండేవి సంకోచిస్తాయి. మానవులలో నవ్వు సంతోషం, ఆనందానికి బాహ్య సంకేతం. కొందరు నిశ్శబ్దంగా నవ్వుకుంటే, కొంత మంది బయటకు శబ్దం వచ్చేటట్లుగా నవ్వుతారు. సాధారణంగా చలోక్తులు, కితకితలు మరికొన్ని రకాల ప్రేరేపణల వలన నవ్వొస్తుంది. నైట్రస్ ఆక్సైడ్ పీల్చడం వలన, కొన్ని మాదక ద్రవ్యాలు వాడడం వలన బిగ్గరగా నవ్వుతారు. బిగ్గరగా నవ్వినప్పుడు కొన్నిసార్లు కన్నీరు రావచ్చును.

మానవులలో నవ్వడాన్ని మెదడు నియంత్రిస్తుంది. సంఘంలోని వ్యక్తుల మధ్య సంబంధాలలో, సంభాషణలలో ఉత్తేజాన్ని కలిగిస్తుంది. నవ్వు ఇతరుల నుండి కలయికను కాంక్షిస్తుంది. కొన్ని సార్లు ఇదొక అంటువ్యాధి లాగా ఒకరి నుండి మరొకరికి వ్యాపిస్తుంది.

నవ్వు కోపానికి విరుగుడు, అనేక రోగాలను దూరం చేసే మంచి టానిక్. దీనికి మించిన వ్యాయామం లేదు. శారీరకంగానూ, మానసికంగానూ ఎంతో ఆరోగ్యాన్నిచ్చి, ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉండేలా చేసేది నవ్వు. నిజానికి ఇది ఒక గొప్ప ఔషధం. ప్రపంచంలో ఎక్కడైనా, ఎవరికైనా ఇది ఇచ్చే ఫలితం మాత్రం మారదు. అంతేకాదు నవ్వు పిరికితనాన్ని కూడా పోగొడుతుంది. నవ్వడం వలన శరీరంలోనున్న రోగాలన్నీ మటుమాయమవుతాయని ఆరోగ్యనిపుణులు అంటున్నారు.

నవ్వు శరీరంలోని కొటికోల్ అయాన్ హార్మోన్లను విడుదల చేస్తుంది. నవ్వు వల్ల ఎండార్ఫిన్ అనే హార్మోన్ ఉత్పత్తి అవుతుంది. ఇవన్నీ బాధను మరిపిస్తాయి, అనేక శారీరక, మానసిక రుగ్మతలను దూరంచేసి ప్రశాంతతను ఇవ్వడంలో ఈ హార్మోన్లు ప్రధానపాత్రను పోషిస్తాయి. మానవులలో నవ్వు, హాస్యానికి సంబంధించిన మానసిక, శరీరధర్మ శాస్త్ర ప్రభావాల గురించి తెలిపే శాస్త్ర విజ్ఞానాన్ని "జెలోటాలజీ" అంటారు.

నవ్వులలో రకాలు చిరునవ్వు లేదా మందహాసం
విరగబడి నవ్వు వికటాట్టహాసం
వెకిలి నవ్వు సుందర మందహాసం
ముసిముసినవ్వు, నవ్వుగాని నవ్వు
చిద్విలాసం బోసినవ్వు

ఇవికాక, ఆధునికి కవులు మరికొన్ని నవ్వులను కనిపెట్టారు. తలకాయ నవ్వు తల మాత్రం తెగ ఝాడిస్తూ వంచేసి కళ్లు మూసుకు నవ్వడం, లయధాటీ నవ్వు %-% తాళం వెయ్యటానికి వీలై ఉండేది. తుపాకి నవ్వు %-% పెదిమల బద్ధలు చేసుకుని ఠప్పున బయల్దేరేది, కొన ఊపిరి నవ్వు %-% గుక్క తిరగని సమయం దాకా మాట్లాడి అప్పుడు మాట తెమలకుండా, నవ్వు రాకుండా నవ్వడం, కోతి నవ్వు %-% నవ్వేమో అని ఇతరులు భ్రమించేది, దాగుడు ముచ్చీ నవ్వు %-% అధికారి ఎవరైనా కని పెడతారేమో అనే భయంతో చప్పున ఆపేసుకోవడానికి ప్రయత్నించే టప్పటిది, సరి విషపు నవ్వు %-% నవ్వు జాతిలో చెడబుట్టి లోపలి ఏడుపుని ఓ ప్రక్క నుంచే వెళ్లగక్కేది, డోకె నవ్వు, దొంగ నవ్వు, కొలిమి తిత్తి నవ్వు, గుడ్స్ బండి నవ్వు ఇలా అనేకం.

తిక్కన సోమయాజి చెప్పిన నవ్వుల రకాలుసవరించు
నవ్వులలో కొన్ని రకాలు ఆంధ్ర మహాభారంతో తిక్కన్న నవ్వుల గురించి వివరిస్తూ, 32 రకాల నవ్వుల గురించి చెప్పారు.

మహాభారతంలో తిక్కన చెప్పిన నవ్వుల రకాలు
పిన్న నవ్వు అల్ల నగవు అలతి నవ్వు
చిరునవ్వు మందస్మిత హర్ష మందస్మిత
అంతస్మితం జనిత మందస్మితం ఉద్గత మందస్మితం
అనాదరం మందస్మితం సాదర దరహాసం తిన్నని నవ్వు
లేత నవ్వు కొండొక నవ్వు పెలుచన నవ్వు
ఉబ్బు మిగిలి నవ్వు గేలికొను నవ్వు ఒత్తిలి నవ్వు
అపహాసం రోషకఠిన హాసం ఊద్భుట నవ్వు
కలకల నవ్వు ఎల నవ్వు ప్రౌఢ స్మితము
బెట్టు నవ్వు కన్నుల నవ్వు కన్నుల నిప్పుల రాలు నవ్వు
కినుక మానిన నవ్వు కినుక మునుగు నవ్వు కఠిన నవ్వు
నవ్వురాని నవ్వు, ఎఱ్ఱ నవ్వు.

నవ్వుతో మరో ఏడేళ్ల ఆయుష్షు.
మనస్ఫూర్తిగా నవ్వే వ్యక్తులు ఎక్కువ కాలం జీవిస్తారు. నోరు పెద్దగా చేసుకొని నవ్వడం, కళ్ల కింద ముడతలు ఉన్న వ్యక్తులు జీవితం పట్ల సానుకూల దృక్పథంతో ఉంటారు. ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుతారు. జీవితంలో ఎన్నడూ నవ్వని ఆటగాళ్లు సరాసరిన 72.9 ఏళ్లు అప్పుడప్పుడూ మాత్రమే నవ్విన వాళ్లు 75 ఏళ్లు, బిగ్గరగా నవ్వేవాళ్లు 79.9 ఏళ్లు జీవించినట్లు పరిశోధనల్లో తేలింది. మొహమాటం కోసం ఉత్తుత్తి నవ్వులు చిందించేవారు ఆయుష్షులో ఎలాంటి మార్పులేదట. బిగ్గరగా నవ్వే వారి ముఖంపై ఉండే కండరాలు సంకోచ, వ్యాకోచం చెంది కాంతివంతమైన వర్ఛస్సుతో ఉంటారు.

**నవ్వులో మరికొన్ని విశేషాలు.**

• నవ్వులో ఆనందం అనే భావావేశం ఉంటుంది. (భావావేశం లేకుండా కూడా నవ్వొచ్చు. అందుకే మనస్ఫూర్తిగా నవ్వే నవ్వుకి, తెచ్చిపెట్టుకున్న నవ్వుకి మధ్య తేడా ఉంటుంది. ఈ విషయం పైకి కూడా కనిపిస్తుంది.)

• నవ్వు వచ్చినప్పుడు ఒక జోక్ ని గాని, ఒక సన్నివేశాన్ని గాని అర్థం చేసుకుని అందులో హాస్యభరితమైన అంశాన్ని గ్రహించాలి. ఇది విషయగ్రహణం (%ఎశీస్త్రఅఱ్‌అశీఅ%) కి సంబంధించిన విషయం.

• నవ్వినప్పుడు ముఖంలో పలు కండరాలు కలిసి పనిచెయ్యాలి కనుక ఇందులో కర్మేంద్రియాల ప్రమేయం ఉంది.

ఈ మూడు రకాల అంశాలని మెదడులో వివిధ ప్రాంతాలు శాసిస్తుంటాయి. అవన్నీ కలిపితే మెదడులో నవ్వుని శాసించే నాడీ వ్యవస్థ అవుతుంది. అయితే ఆ సంపూర్ణ వ్యవస్థలో ఏఏ ప్రాంతాలు భాగాలుగా ఉన్నాయి, అవి ఎలా కలిసి పనిచేస్తున్నాయి అన్న విషయం ప్రస్తుతానికి స్పష్టంగా లేదు. దాని గురించి ఇంకా పరిశోధన జరుగుతోంది. మనసారా నవ్వగలగడం అలవరచుకుంటే ఆరోగ్యాన్ని పెంపొందించు కున్నట్లే, శారీరక ఆరోగ్యంతో పాటు మానసికానందం, ప్రశాంతత ఏర్పడతాయి. చక్కగా నవ్వుతూండటం, నవ్వుతూ మాట్లాడే వారితో తోటివారు స్నేహం చేయటానికి ఆసక్తి చూపుతారు.

నవ్వుల్లో కూడా అనేక రకాలు ఉన్నాయి. ఎదుటివారిని హేళనచేస్తూ నవ్వడం, ఎదుటివారి నిస్సహాయతను చూసినవ్వడం, ఏదయినా తొక్కమీద కాలువేసి జారిపడినా, రాయి తగిలి జారినా వారిని చూసి నవ్వాపుకోలేకపోవడం, వికటాట్టహాసం, వక్రపునవ్వు, ఎదుటివారి అపజయానికి ఎద్దేవాగా నవ్వడంలాంటి నవ్వులు ఆరోగ్యకర మయినవి కావు. ఆ నవ్వు వెనకాల ఉండే అర్థాన్ని గ్రహించిన ఎదుటివారు వారి స్వభావాన్ని చీదరించుకుంటూ వారికి దూరంగా తప్పుకుంటారు.

నవ్వు వలన ప్రయోజనాలు.
నవ్వువల్ల ఎన్నెనో ప్రయోజనాలున్నాయి.
చ ఆవేశాన్ని, ఉద్రిక్తతను తగ్గించటానికి తోడ్పడుతుంది నవ్వు.
చదేహంలో రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది.
చమానసిక ఒత్తిడిని తగ్గించి, స్ట్రెస్ హార్మోన్ల లెవెల్స్‌ను తక్కువచేసి, మానసిక ఆరోగ్యానికి తోడ్పడుతుంది.
చ శ్వాసకు సంబంధించిన వ్యాధులను ఎదుర్కోవటానికి సిద్ధపడే యాంటీబాడీస్ ఉత్పత్తిని పెంచు తుంది.
చముఖానికి చక్కని వ్యాయామం కలుగు తుంది. ముఖ సౌందర్యాన్ని పెంచుతుంది.
చ దీర్ఘకాల వ్యాధులతో బాధపడేవారికి నవ్వు దివ్యౌషధంలా, చికిత్సగా పనిచేస్తుంది.
చ నోరంతా తెరచి నవ్వడం వల్ల ఆక్సిజన్ సమృద్ధిగా లభిస్తుంది.
చ ఉచ్ఛ్వాసనిశ్వాసాలు సక్రమంగా జరిగేలా చేస్తుంది. హార్ట్‌రేట్ తగ్గుతుంది.
చమనస్సులోని దిగులును, బాధలను మరపింపచేసి మనస్సును తేలికచేస్తుంది.
చబాధను తట్టుకునే శక్తిని పెంచుతుంది.
చనవ్వడం ద్వారా శరీరంలో కండరాలు, నరాలు, అవయవాలు ఉత్తేజితం పొందుతాయి.
చఏ విషయాన్నయినా బాధపడకుండా హాస్యంగానూ, తేలికగానూ, నవ్వుతూ తీసుకునే మనస్తత్వం అలవడుతుంది.

నవ్వుతో సామెతలుసవరించు
నవ్వు నాలుగు విదాల చేటు
నవ్విన నాప చేనే పండుతుంది
నవ్వి పోదురు గాక నాకేటి సిగ్గు.

అనే సామెతలు మొనకు తెలిసినవే! నేటి మన జీవనంలో ఆరోగ్యంగాజీవించాలి అంటే నవ్వే శరణ్యం.అందుకే నవ్వుతూ నవ్విస్తూనిండు నూరేళ్ళు సంతోషంగా జీవిద్దాం!

బెల్లంకొండ నాగేశ్వరరావు.
9884429899

# కన్నుల పండువగా సహస్ర కలశాభిషేకం





**ధర్మపురి మే 17 (ప్రజామంటలు):** సుప్రసిద్ధ ప్రాచీన పుణ్య క్షేత్రమైన ధర్మపురి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న నరసింహ నవరాత్రి ఉత్సవాలలో అంతర్భాగంగా శుక్రవారం సహస్ర కలశాభిషేక మహోత్స కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. దేవస్థానం ఏసి,ఇఓ సంకటాల శ్రీనివాస్ మార్గ దర్శకత్వంలో, వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, ముత్యాల శర్మ, ప్రవీణ్ కుమార్ శర్మ, ఉపప్రధాన అర్చకులు నేరేళ్ళ శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచార్యులు, సిహెచ్ రమణయ్య, అర్చకులు నంబి నర్సింహమూర్తి, నేరేళ్ళ సంతోష్ కుమార్, వొద్దిపర్తి కళ్యాణ్, సముద్రాల వంశీ, చక్రపాణి కిరణ్, అభిషేక పురోహితులు బొజ్జ సంతోష్ కుమార్, బొజ్జ సంపత్ కుమార్, బొజ్జ రాజగోపాల్ శర్మ, ప్రత్యేక పూజలొనరించారు. సూపరింటెండెంట్ కిరణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, సిబ్బంది పర్యవేక్షణలో జరిగాయి. ఉదయాత్పూర్వం మంగళ వాద్యాలతో, వేద మంత్రాలతో, పవిత్ర జలాలను కొని తెచ్చారు. దేవ స్థానంలోని ప్రధానాలయమైన శ్రీయోగానంద లయంలో అప్పటికి సిద్ధం చేసి ఉన్న సహస్ర కలశాలలో పవిత్ర జలాలను పోసి, మూల విరాట్టుకు కలశాభిషేకాన్ని వేదమంత్ర సంప్రదాయ యుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వాస్తు, క్షేత్ర పాలక, యోగిని, బ్రహ్మాది మండల నవగ్రహ, సుదర్శన, వరుణాది స్థాపిత దేవతా హెరీమాలు, జయాది హెరీమాలు, శ్రీలక్ష్మీ నరసింహ సహస్ర నామార్చనలు, పురుష సూక్త, శ్రీసూక్త, కల్పోక్షన్యాస, పంచోప నిషత్ యుక్త అభిషేకాలు, రామాయణం భారత, భాగవతాది పురాణ, లక్ష్మీసూక్త సంపుటీకరణ పారాయ బలిదానాలు, పూర్ణాహుతి, ఇత్యాది క్రతువులు సాంప్రదాయ రీతిలో గావించారు. ఈసందర్భంగా యోగనంద, ఉగ్ర లక్ష్మీ నరసింహా లయాలలో అభిషేకాలు నిత్య అర్చనలు, కల్యాణోత్సవం, నవరాత్రి పూజలలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## పరకాల తిరుపతి వర్ధంతి, అన్నదాన కార్యక్రమం



**జమ్మికుంట మే 17 (ప్రజామంటలు):** ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామానికి చెందిన కీ.శే. పరకాల తిరుపతి గౌడ్ నాలుగవ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు జమ్మికుంట మండలం కేంద్రం లోని స్పందన అనాధ ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జమ్మికుంట మండల జడ్పిటిసి డాక్టర్ శ్రీరామ్ శ్యాం, సిరిసేడు సర్పంచ్ రఫీ ఖాన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరి చేతుల మీదుగా అనాధ పిల్లలకి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి భార్య పరకాల రేణుక, కుమారుడు సాయి కుమార్,సిరి సైడ్ మాజీ ఎంపిటిసి భీనవేనా సదయ్య, సిరిసేడు గ్రామ గౌడ సంఘం అధ్యక్షులు దేశిని మహేష్, జిల్లెల్ల దేవేందర్ రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


## చెరువులను కాపాడుకోవడమే గంగమ్మ ఉత్సవాల ప్రత్యేకత



**రాయికల్ మే 17 (ప్రజామంటలు):** చెరువులను కాపాడుకోవడమే గంగమ్మ ఉత్సవాల ప్రత్యేకత అని గంగపుత్ర సభ్యులు తెలిపారు. రాయికల్ మండలం భూపతిపూర్ గ్రామంలో పెద్ద చెరువు గట్టు మీద నెలకొన్న గంగాదేవి ఆలయం లో శుక్రవారం గంగపుత్రసంఘం సభ్యులు ఘనంగా బోనాల ఉత్సవాలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయంలో పురోహితులు చెరుకు మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు గంగా శివుని కళ్యాణోత్సవం హెూమం నిర్వహించారు. చెరువులను కాపాడుకోవడమే గంగమ్మ ఉత్సవాల ప్రత్యేకత అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగపుత్రసంఘం అధ్యక్షులు కామని రజనీ కుమార్, కార్యదర్శి హరీశ్ కుమార్, ఉపాధ్యక్షులు చంద్ర ప్రకాశ్, సభ్యులు మాసపేట మల్లయ్య, వెంకట్రాజం, తెలుగు పండితులు కామని లక్ష్మయ్య, సూర్యప్రకాశ్, రాజేశం, భూమరాజం, కామని నరేశ్, తోపారపు రమేశ్, అరవింద్ ప్రభాస్, మాసపేట రాజ్ కుమార్, చిన్న నర్సయ్య, గంగాధర్, మురళి, పల్లికొండ లక్ష్మీ నారాయణ, పురోహితులు చెరుకు మధుసూదన్, మహేశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వాగ్దేవి డిగ్రీ కళాశాలలో నూతన కోర్సు ప్రారంభం

### కరస్పాండెంట్ ఏనుగు మహిపాల్ రెడ్డి



**జమ్మికుంట మే 17 (ప్రజామంటలు):** గత 15 సంవత్సరాలనుండి నుండి హుజురాబాద్ డివిజన్ లో సైన్స్, కామర్స్, ఆర్ట్స్ కోర్సు లతో హుజురాబాద్ డివిజన్ స్థాయి లో విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందిస్తు వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నటువంటి శ్రీ వాగ్దేవి డిగ్రీ కళాశాల లో ఈ విద్యా సంవత్సరం నుండి కొత్తగా బిబిఏ (బాచిలర్ అఫ్ బిజినెస్ అడ్మినియట్రేషన్ ) కోర్స్ ను ప్రారంభిస్తున్నామని కళాశాల కరెస్పాండంట్ ఏనుగు మహిపాల్ రెడ్డి తెలిపారు. ఇంటర్మీడియట్ ల సైన్స్, కామర్స్, ఆర్ట్స్ కోర్సు లో పాస్ అయిన విద్యార్థులందరు ఈ కోర్సులో చేరడానికి అర్హులు. మా కళాశాల లో బిబిఏ తో పాటు బి.కాం (కంప్యూటర్ అప్లికషన్), బి.ఎస్.సి. ( ఏమ్.పి.సి.ఎస్./ ఎం.సి.సి.ఎస్./ ఎం.పి.సి.), బి.ఎస్.సి (బి.జడ్.సి.) కోర్సులు కలవు కావున విద్యార్థులు గమనించగలరు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోగలరు. అలాగే విద్యార్థులు దోస్త్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొని బిబిఏ కోర్సు లో అడ్మిషన్స్ పొందగలరు. ఇతర వివరాలకు కళాశాల కరెస్పాండంట్ ఏనుగు మహిపాల్ రెడ్డి ని 9885069146 నంబర్లో సంప్రదించగలరు.

## సొసైటీ కొనుగోలు కేంద్రం నిర్లక్ష్యంతో రోడ్డు పైకి వచ్చిన అన్నదాతలు



**రాయికల్ మే 17 (ప్రజామంటలు):** ప్రతి సంవత్సరం సొసైటీ కొనుగోలు కేంద్ర నిర్లక్ష్యంతో రోడ్డుపైకి రావాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రాయికల్ మైతాపూర్ రోడ్డు మధ్యలో రైతులు రెండు గంటల పాటు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు రైతులు మాట్లాడుతూ కేవలం ఆరుగురు హమాలీలతో ధాన్యం తూకం వేస్తున్నారని, తూకం వేసిన ధాన్యాన్ని లారీల కొరత ఉందంటూ మిల్లులకు తరలించకపోవడంతో ఆరుగాలలపాటు శ్రమించి పండించిన పంట అకాల వర్షంతో తడిసిపోతుందని అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వేగంగా కొనుగోలు జరిపి ధాన్యాన్ని మిల్లులకు తొందర తరలించాలని కోరారు. రైతులు ఆందోళన సమాచారంతో రెవెన్యూ ఇన్స్పెక్టర్ పద్మయ్య, ఏఎస్ఐ దేవేందర్, పది రోజుల్లో కల్లాల నుండి ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని సిఈఓకు సూచించి, రైతులకు నచ్చచెప్పడంతో రైతులు నిరసన విరమించారు.

# రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

### రెండు లక్షలు మాఫీ చేస్తాం..

**మద్దతు ధరకు అదనంగా రూ. 500 బోనస్ ఇస్తాం**

**విలేకరుల సమావేశంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి**



**జగిత్యాల మే 17 (ప్రజామంటలు):** ధాన్యం తూకంలో కోత లేకుండా సేకరిస్తున్నాం. రైతులను విస్మరించిన బీఆర్ఎస్ పార్టీ రైతు దీక్ష చేయడం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆరోపించారు. విలేకరుల సమావేశంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటి పర్తి జీవన్ రెడ్డి మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ బిజెపికి అమ్ముడు పోయింది. గెలిచినా..ఓడినా.. చరిత్రలో నిలుస్తా. బీఆర్ఎస్ పాలనలో వరి వేస్తే ఉరి.. కేవలం సన్న రకాలు సాగు. చేయాలి.... ధాన్యం కొనుగోలు చేయం అని తూములు కూడా బందు చేసింద్రు అని అన్నారు.ఇంకా, ఐదేళ్లు పూర్తి అయిన పూర్తి స్థాయిలో రుణ మాఫీ చేయలేదు. కెసిఆర్ సన్నరకాలు సాగుచేస్తే ఏవిధమైన ప్రోత్సాహం ఇవ్వలేదు.ఏక మొత్తంగా ఇవ్వాల్సిన రుణ మాఫీ విడతల వారీగా అమలు చేసింద్రు. ఇప్పుడు రైతులకు బోనస్ ఇవ్వాలని బీ అర్ ఎస్ నాయకులు రైతు దీక్ష చేపట్టడం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది..రసాయనిక ఎరువుల ధరలు పెరిగినాయి.డీజిల్ ధరలు పెరిగినాయి. పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా క్వింటాల్ కు 3000 ఉంటేనే గిట్టుబాటు అవుతుంది. యూపీఏ పాలనలో 2004 లో ధాన్యం క్వింటాల్ కు రు.450 మద్దతు ధర 2014 వరకు రు.1350 మూడింతలు పెరిగింది. ఎన్డీఏ పదేళ్ల పాలనలో కేవలం 1350 నుండి రు.2,200 పెంచింది. స్వామి నాథన్ సిఫార్సులు పరిగణలోకి తీసుకోవడం లేదు. రైతులకు మద్దతు ధర గిట్టుబాటు కావడం లేదని రైతులకు అండగా నిలువాలని రు.500 బోనస్ ప్రకటిస్తే ఎట్లా ఇస్తారు అని విమర్శిస్తున్నరు. పీ డీ ఎస్ బియ్యం పక్కదారి పట్టకుండా, రీ సైక్లింగ్ అరికట్టబడాలి.మొదటి విడతగా రైతుకు కూడా సన్నరకాల సాగు కు బోనస్ అందిస్తాం. సన్న రకాల సాగు ఖరీఫ్ లోనే చేస్తారు.. ఈ విషయం కెసిఆర్ కు తెలుసో తెలియదో.. అందరూ 500 బోనస్ అమలు సాధ్యమా అని అనుకున్నారు.బోనస్ అమలు కు చర్యలు చేపడుతున్నాం.ఖరీఫ్ పంట నాటికి రెండు లక్షలు రుణ మాజీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డీ నిర్మాణాత్మకంగా కార్యాచరణ రూపొందించి, చర్యలు చేపడుతున్నం. రైతులకు అండగా నిల్చెందుకు రైతు భరోసా అమలు చేసినం.రుణ మాఫీ చేయబోతున్నాం. ప్రభుత్వం అప్పు తీసుకు వచ్చి అయినా రుణ మాఫీ చేస్తుంది. బీ అర్ ఎస్ రైతులకు బోనస్ ఇవ్వాలనే ఆలోచన కూడా చేయలేదు. ఐదేళ్ల లో పూర్తి స్థాయిలో రుణ మాఫీ. చేయలేదు. గతంలో క్వింటాల్ కు 10 కిలోలు అదనపు తూకం వేసింద్రు కాంగ్రెస్ ప్రభుత్వం ఎటువంటి కోత లేకుండా సేకరిస్తోంది. ఈ ఏడాది అదనంగా లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినం.కల్లాల వద్ద ఇబ్బందులు లేకుండా తడిసిన సేకరించెలా, రైతులు ఆందోళన పడకుండా చర్యలు చేపడుతున్నాం. రైతులకు అండగా నిల్చిన కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరును బీ అర్ ఎస్ జీర్ణించుకోలేక, ఉనికి కాపాడుకోవాలని దీక్షలు చేస్తోంది. ప్రతిపక్షాలు బాధ్యతతో వ్యవహరించాలి. డెడ్ స్టోరేజి నుండి కుండా నీరు విడుదల చేసి పంటలను కాపాడినం. విద్యుత్ గతేడాది కన్న ఏడాది 50 శాతం అదనంగా వినియోగం ఉన్నది. ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులకు అండగా నిలిచెందుకు క్వింటాల్ కు మద్దతు ధర రు. 3000 ఇస్తాం. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం కోట్లాది మందికి ఉపాధి కల్పిస్తున్నది. ఆహార భద్రత చట్టం విద్యా హక్కు చట్టం.. పాలనలో పారదర్శకత కోసం సమాచార హక్కు చట్టం తీసుకు వచ్చినం. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ను బిజెపి కి కుదువ బెట్టింద్రు.కాంగ్రెస్ ను గెలువకుండ అడ్డకునెందుకు బీ అర్ ఎస్ పార్టీ, బిజెపి కి అమ్ముడు పోయింది. పదేళ్లలో బిజెపి ప్రజల కోసం ఎం పథకాలు ప్రవేశ పెట్టింది.. ..బిజెపి కి ప్రజలకు ఎట్లా సేవ చేయాలనే ఆలోచన లేదు..

**బిజెపి కి సిద్ధాంతం ఉన్నదా..?**

కేవలం మత విద్వేషాలు రెచ్చగొట్టే రాజకీయం చేయడం మినహా.. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఉచిత విద్యుత్ ఇస్తుందా.. బోనస్ ఇస్తుందా.. ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నదా? అని జీవన్ రెడ్డీ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యం తో పని చేస్తుంది. దేశం కోసం ప్రాణాలు అర్పించిన పార్టీ కాంగ్రెస్. భారతదేశ అభివృద్ధికి బాటలు వేసింది కాంగ్రెస్ అని ఉద్ఘాటించారు. రాజకీయంగా జన్మనిచ్చిన జగిత్యాల ప్రజలకు సేవ చేయాలనే తపనతో నిజామాబాద్ నుండి పోటీ చేసిన.నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో గట్టి పోటీ ఉంటుందని తెలిసి కూడా పోటీ చేసిన, గెలిస్తే అర్జునుడిని అవుతా.....ఓడితే అభిమన్యుడిని అవుతా.... గెలిచినా గెలువకపోయిన చరిత్రలో నిలిచిపోతా.....అని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా అన్నారు.

## పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్



**జగిత్యాల మే 17 (ప్రజామంటలు):** రైతులు పండించిన వరి ధాన్యం ను త్వరగా తూకం వేసి మిల్లులకు పంపించాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. శుక్రవారం రోజున జగిత్యాల రూరల్, మేడిపల్లి, మెట్ పల్లి మండలాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ%%. ధాన్యం కేంద్రాలకు వచ్చిన వరి పంటను తొందరగా కాంటా వేసి మిల్లులకు తరలించాలని అన్నారు. నిన్న వచ్చిన అకాల వర్షాల వలన పంట నష్టం గురించి తెలుసుకున్నారు మరియు రెండు, మూడు రోజులలో పూర్తి స్థాయిలో కొనుగోలు కేంద్రాలు పూర్తి చేయాలనీ, ఆయా కేంద్రాల నుండి ధాన్యం తరలించాలని అన్నారు. ఎప్పటికప్పుడు ట్యాబ్ రికార్డులలో ఎంట్రీ నమోదు చేయాలని అన్నారు. రానున్న రోజుల్లో వర్ష సూచన ఉన్నదున రైతు లకు టర్పాలిన్ ఇవ్వాలని పంట నష్టం జరగకుండ చూడాలని సూచించారు. ఆయన వెంట డి.టి.సి.స్. వర ప్రసాద్, ఉమాపతి ఎఫ్ ఐ శ్రీనివాస్ పలువురు అధికారులు ఉన్నారు.

## ఇల్లందకుంట ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్ష, కార్యదర్శి లకు సన్మానం

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఇంగిలే రామారావు**



**జమ్మికుంట మే 07 (ప్రజామంటలు):** ఇల్లందకుంట మండల కేంద్రంలో బుధవారం జరిగిన ప్రెస్ క్లబ్ కార్యవర్గ సమావేశంలో (ఐజేయూ) ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షులుగా జక్కే బాలరాజు గౌడ్ మరియు ప్రధాన కార్యదర్శిగా ఇంగిలే ప్రభాకర్ ని ఏకగ్రీవంగా ఎన్నికైనందుకుగాను ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ అధ్యక్షులు మర్యాదపూర్వకంగా కలిసి స్వీట్లు తినిపించి శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.... రానున్న రోజులలో మరెన్నో పదవులు అధిరోహించి ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ అలాగే జర్నలిస్టుల సమస్యలను పరిష్కారం దిశగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫిషర్మెన్ చైర్మన్ బండి మల్లేష్, గౌడిశాల పరమేష్, ఉప్పుల అమరేందర్ రెడ్డి, ఎండి సలీం, విజయ్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్-4 ఉద్యోగాల భర్తీ..

### త్వరలో సర్టిఫికెట్ వెరిఫికేషన్

**హైదరాబాద్,మే17:** గ్రూప్-4 ఉద్యోగాల భర్తీకి సంబంధించి త్వరలోనే సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ వెల్లడించింది. జనరల్ ర్యాంకింగ్ జాబితాను ఈ ఏడాది ఫిబ్రవరి 9వ తేదీన టీఎస్‌పీఎస్సీ విడుదల చేసిన సంగతి తెలిసిందే. జనరల్ అభ్యర్థులను 1:3 నిష్పత్తిలో, పీడబ్ల్యూడీ అభ్యర్థులను 1:5 నిష్పత్తిలో పిలవనున్నారు. కమ్యూనిటీ, నాన్ క్రిమి లేయర్(బీసీలకు), పీడబ్ల్యూడీ సర్టిఫికెట్స్, స్టడీ లేదా రెసిడెన్స్ సర్టిఫికెట్స్(క్లాస్ 1 నుంచి ఏడు వరకు), రిజర్వేషన్ కలిగి ఉంటే దానికి సంబంధించి డాక్యుమెంట్లు, ఏజ్ రిలాక్సేషన్, క్వాలిఫికేషన్ సర్టిఫికెట్లు రెడీగా ఉంచుకోవాలని టీఎస్‌పీఎస్సీ సూచించింది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ సమయంలో వీటిలో ఏ డాక్యుమెంట్ సమర్పించకపోయినా ఆ అభ్యర్థులను పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేసింది.

## ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ హాల్‌టిక్కెట్ల విడుదల

**హైదరాబాద్,మే17:** ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుంచి ప్రారంభం కానున్నాయి. జూన్ 3వ తేదీ వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మ. 12 గంటల వరకు ఫస్టియర్ విద్యార్థులకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు సెకండియర్ విద్యార్థులకు పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసింది. సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులు నేరుగా ఇంటర్ బోర్డు వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. హాల్ టికెట్ డౌన్ లోడ్ చేసుకున్న తర్వాత విద్యార్థులు తమ ఫొటో, సంతకం, పేరు, మీడియంతో పాటు ఏయే సబ్జెక్టులు రాస్తున్నామో వాటిని గమనించాలి. వాటిలో ఏవైనా తప్పులు ఉంటే తక్షణమే సంబంధిత కాలేజీ ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలి. హాల్ టికెట్లపై ప్రిన్సిపాల్స్ సంతకాలు లేకపోయినప్పటికీ పరీక్ష రాసేందుకు అనుమతించాలని ఇంటర్ బోర్డు చీఫ్ సూపరింటెండెంట్లకు ఆదేశాలు జారీ చేసింది.

## వైస్ ఎంపీపీని పరామర్శించిన మాజీమంత్రి కొప్పుల



**గొల్లపల్లి మే 17 (ప్రజామంటలు):** ప్రైవేట్ హాస్పిటల్లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న గొల్లపల్లి వైస్ ఎంపీపీ ఆవుల సత్యం ను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆయనతోపాటు జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు, గొల్లపల్లి జడ్పీటీసీ గొస్కుల జలెంధర్ పరామర్శించారు.

# కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో తారల తళుక్కులు

## క్యాట్ వాక్‌తో ఆకట్టుకున్న ఐశ్వర్య..ఊర్వశి రౌతాల




అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ఫ్రాన్స్‌లో జరిగే కేన్స్‌కు ప్రత్యేకత ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఎందరో సినీ తారలు ఈ కార్యక్రమంలో పాల్గొని రెడ్ కార్పెట్‌పై సందడి చేస్తుంటారు. ప్రస్తుతం 77వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ అట్టహాసంగా జరుగుతోంది. ఈ వేడుకల్లో బాలీవుడ్‌కు చెందిన పలువురు స్టార్స్ సందడి చేస్తున్నారు. కేన్స్ ఫిలం ఫిస్టివల్‌లో మన తారలు తళుక్కుమన్నారు. ఇద్దరు తారలు తమ అందాల ఆరబోతతో ఆకట్టుకున్నారు. ఇందులో మాజీ ప్రపంచ సుందరి ఐశ్వర్య రాయ్ బచ్చన్ తళుక్కుమన్నది. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఆ బ్యూటీ క్యాట్‌వాక్ చేసింది. మెగాలోపోలిస్ ఫిల్మ్ కోసం ఆమె రెడ్‌కార్పెట్‌పై జిగేల్మన్నది. ఫాల్గుణి అండ్ షేన్ పీకాక్ డిజైనర్లు రూపొందించిన బ్లాక్ గౌన్‌లో ఐశ్వర్య దర్శనమిచ్చింది. గత రెండు దశాబ్దాల నుంచి కేన్స్ ఫెస్టివల్‌లో ఐశ్వర్య.. ఫిల్మ్ లవర్స్‌ను థ్రిల్ చేస్తూనే ఉన్నది. త్రీడీ మెటాలిక్ ఎలిమెంట్స్ ఉన్న మోనోక్రోమ్ గౌన్‌లో ఐశ్వర్య కనిపించారు. అయితే ఐశ్వర్య కుడి చేతికి ఇటీవల గాయమైంది. అయితే ఏ కారణం చేత ఆమెకు గాయమైందో తెలియదు. కానీ చేతి కట్టుతోనే ఆమె క్యాట్‌వాక్‌లో పాల్గొన్నది. ఐశ్వర్య కూతురు ఆరాధ్య కూడా ఫిల్మ్ ఫెస్టివల్‌లో కనిపించింది. కియారా అద్వానీ, సోభితా దూళిపాళ, ఆదితి రావు హైదరీతో పాటు ఇతర బాలీవుడ్ నటీనటులు కేన్స్‌లో దర్శనమిచ్చారు. 77వ కేన్స్ ఫెస్టివల్‌లో ఐశ్వర్య క్యాట్‌వాక్‌లో పాల్గొనడం ఇది 21వసారి. ఐశ్వర్య రాయ్ బచ్చన్ రెడ్ కార్పెట్‌పై క్యాట్ వాక్‌తో ఆకట్టుకోగా.. తాజాగా మరో నటి ఊర్వశి రౌతేలా సైతం సందడి చేసింది. కస్టమ్ మేడ్ గౌనులో హొయలు పోతూ అందరినీ ఆకట్టుకుంది. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఊర్వశి ఇన్‌స్టా వేదికగా అభిమానులతో పంచుకుంది. ప్రస్తుతం ఈ ఫొటోలు తెగ వైరల్ అవుతున్నాయి. ఇక ఈ ఏడాది కేన్స్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో ఐశ్వర్య తన కూతురు ఆరాధ్యతో కలిసి పాల్గొనింది. కియారా అద్వానీ, సోభితా దూళిపాళ, ఆదితి రావు హైదరీతో పాటు ఇతర బాలీవుడ్ నటీనటులు కేన్స్‌లో దర్శనమివ్వనున్నారు.



# ప్రభాస్ పోస్ట్‌పై అభిమానుల తర్జనభర్జనలు


## ఆ ప్రత్యేక వ్యక్తి ఎవరంటూ నెటిజన్ల ఆసక్తి




టాలీవుడ్ స్టార్ హీరో ప్రభాస్ పెట్టిన ఇన్‌స్టా పోస్ట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. చాలా అరుదుగా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఆయన ఓ ఆసక్తికర పోస్ట్ పెట్టారు. దీంతో అది టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. 'డార్లింగ్స్.. ఎట్టకేలకు మన జీవితంలోకి ఓ ప్రత్యేక వ్యక్తి రాబోతున్నారు. వెయిట్ చేయండి' అంటూ రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌లో చెప్పిన ప్రత్యేక వ్యక్తి ఎవరంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. దానికి సంబంధించిన స్క్రీన్ షాట్‌ను ఫ్యాన్స్ ఎక్స్‌లో షేర్ చేస్తున్నారు. ఆయన నటిస్తోన్న 'కల్కి' సినిమాలో కమల్ హాసన్ లుక్ రిలీజ్ చేయనున్నట్లు టాక్. ఈ సినిమా ప్రమోషన్స్ కోసమే ఈ పోస్ట్ పెట్టినట్లు సమాచారం. తనకు కమల్ హాసన్ అంటే ఎంత ఇష్టమో ప్రభాస్ ఇప్పటికీ చాలా సార్లు చెప్పారు. ఆయన ఈ సినిమాలో భాగమైనట్లు వెల్లడించినప్పుడు కూడా ఆనందంతో పోస్ట్ పెట్టారు.. 'నా హృదయంలో శాశ్వతంగా నిలిచిపోయే క్షణం. కమల్ హాసన్ లాంటి లెజెండరీ నటుడితో కలిసి పనిచేయడం నాకు దక్కిన గౌరవంగా, అదృష్టంగా భావిస్తున్నా' అని అన్నారు. ఇప్పుడు కూడా ఆయన కోసమే ప్రభాస్ ఈ పోస్ట్ పెట్టినట్లు అర్థమవుతోంది. మరికొందరు మాత్రం ఆయన పెళ్లి గురించి పెట్టారని చర్చించు కుంటున్నారు. ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రానున్న సైన్స్ ఫిక్షన్ థ్రిల్లరే 'కల్కి 2898 ఏడీ. ఇందులో కమల్‌హాసన్ ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్నారు. ప్రభాస్‌కు జోడీగా దీపిక పదుకొణె నటిస్తుండగా పశుపతి, దిశాపటానీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. చిత్రీకరణ తుది దశలో ఉన్న ఈ మూవీ జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# రాజమౌళి, మహేశ్‌బాబుల కాంబో

## క్రేజీ ప్రాజెక్ట్‌పై ర్యూమర్స్..నమ్మవద్దన్న సంస్థ



స్టార్ డైరెక్టర్ రాజమౌళి దర్శకత్వంలో అగ్ర కథానాయకుడు మహేశ్ బాబు ఓ సినిమాలో నటించనున్న విషయం తెలిసిందే. ఈ క్రేజీ ప్రాజెక్ట్ ఎప్పుడు మొదలవుతుందా అని సినీ ప్రియులంతా ఎదురు చూస్తున్నారు. దీనికి సంబంధించిన చిన్న విషయం బయటకు వచ్చినా అది క్షణాల్లో వైరల్‌గా మారుతోంది. తాజాగా ఈ ప్రాజెక్ట్ కాస్టింగ్ గురించి ఓ వార్త సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతుంది. దీనిపై నిర్మాణ సంస్థ క్లారిటీ ఇస్తూ నోట్ రిలీజ్ చేసింది. 'రాజమౌళి-మహేశ్‌బాబు ప్రాజెక్ట్‌కు సంబంధించిన నటీనటుల ఎంపికపై రకరకాల వార్తలు వస్తున్నాయి. కొన్ని ఆంగ్ల వెబ్‌సైట్స్‌లో వెలువడిన కథనాలు మా దృష్టికి వచ్చాయి. కాస్టింగ్ డైరెక్టర్ వీరేన్ స్వామి సినిమాలో భాగమైనట్లు రాశారు. అందులో నిజం లేదు. ఈ మూవీకి సంబంధించి ఏ అప్‌డేట్ అయినా మేమే ఇస్తాం. ప్రొడక్షన్ హౌస్ నుంచి వచ్చే అధికారిక ప్రకటనను తప్ప మరే ఇతర అప్‌డేట్‌లను నమ్మొద్దు' అని శ్రీ దుర్గ ఆర్ట్స్ పేర్కొంది. ప్రస్తుతం దీని ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ భారీ ప్రాజెక్ట్‌కు 'మహారాజ్' అనే టైటిల్‌ను ఫిక్స్ చేసినట్లు కూడా వార్తలు వచ్చాయి. ఇందులో ఇండోనేషియా నటి చెల్సియా ఎలిజబెత్ ఇస్లాన్ హీరోయిన్‌గా, హాలీవుడ్ ప్రముఖ నటుడు క్రిస్ హెమ్స్‌వర్త్ కీలకపాత్ర పోషించనున్నారని కూడా జోరుగా ప్రచారమవుతోంది. మరోవైపు మహేశ్ బాబు కూడా ఈ సినిమా కోసం సిద్ధమవుతున్నారు. తన లుక్‌ను కూడా మార్చుకున్నారు.

# ప్రశాంత్ నీల్-ఎన్టీఆర్ కాంబినేషన్ మూవీ

## చిత్రానికి డ్రాగన్ పేరు పెట్టినట్లు వైరల్



ప్రశాంత్ నీల్ - ఎన్టీఆర్ కాంబినేషన్‌లో ఓ సినిమా రానున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాను అధికారికంగా ప్రకటించి చాలా నెలలు అవుతోంది. అప్పటి నుంచి దీనిపై ఎలాంటి అప్‌డేట్ లేకపోవడంతో ఫ్యాన్స్ మూవీ టీమ్‌ను ట్యాగ్ చేస్తూ పోస్ట్‌లు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో ఓ వార్త సోషల్ మీడియాలో షేర్ అవుతోంది. 'ఎన్టీఆర్31'వర్కింగ్ టైటిల్‌తో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోన్న ఈ చిత్రానికి 'డ్రాగన్'పేరు ఖరారు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ పేరుతో కొన్ని పోస్టర్లు ఎక్స్‌లో దర్శనమిస్తున్నాయి. అక్టోబర్‌లో ఈ భారీ బ్జడెట్ మూవీ పట్టాలెక్కనున్నట్లు సమా చారం. ప్రశాంత్ నీల్ ఈ చిత్రాన్ని కూడా రెండు భాగాలుగా తెరకెక్కించాలని భావిస్తు న్నారట. త్వరలోనే దీనికి సంబంధించిన అధికా రిక ప్రకటన రానున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇక ప్రస్తుతం అటు ప్రశాంత్ నీల్ , ఇటు ఎన్టీఆర్ ఇద్దరూ వేర్వేరు సినిమాలతో బిజీగా ఉన్నారు. ప్రశాంత్ నీల్ 'సలార్2' పనుల్లో మునిగిపో యారు. ఎన్టీఆర్ 'దేవర' షూటింగ్‌లో ఉన్నారు. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న యాక్షన్ డ్రామా ఇది. సముద్ర తీర ప్రాంతం నేపథ్యంలో రెండు భాగాలుగా రూపొందు తోంది. ఈ మూవీతోనే బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ (ఏజీనిరలతి ఐజూనీనీస) టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు. సైఫ్‌అలీఖాన్ ప్రతినా యకుడు. తొలిభాగం అక్టోబరు10న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీనితో పాటు 'వార్2' లోనూ ఎన్టీ ఆర్ నటిస్తున్నారు.

# గేమ్ ఛేంజర్ తరవాతే బుచ్చిబాబుతో సినిమా



గ్లోబల్‌స్టార్ రాంచరణ్ హీరోగా, అగ్ర దర్శకుడు శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న 'గేమ్ ఛేంజర్' షూటింగ్ మొదలై చాలా కాలం అయినా ఇప్పటికీ ఓ కొలిక్కి రాలేదు. ఇటీవల తాజా షెడ్యూల్ మొదలు పెట్టారు. అక్టోబర్‌లో విడుదల చేయాలన్న తాపత్రయంతో శరవేగంగా చిత్రీకరణ చేస్తున్నారు. ఈ చిత్రం తర్వాత రామ్‌చరణ్ 'ఉప్పెన' ఫేం బుచ్చిబాబు సానా దర్శకత్వంలో 'ఆర్‌సీ 16' వర్కింగ్ టైటిల్‌తో ఓ చిత్రం చేయబోతున్నారు. ఇటీవల గ్రాండ్‌గా ఈ చిత్రం పూజా రెగ్యులర్ షూటింగ్ ఇంకా మొదలు కాలేదు. దర్శకుడు బుచ్చిబాబు అయితే షూటింగ్ ఎప్పుడు మొదలుపెడదామా అని ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. అయితే 'గేమ్ చేంజర్' షూటింగ్ పూర్తి కాకుండా రాంచరణ్ ఈ సినిమా షూటింగ్ పాల్గొనకూడదని ఫిక్స్ అయ్యారట. ప్రస్తుతం ఈ వార్త నెట్టింట వైరల్ అవుతోంది. 'ఆర్‌సీ 16' షూటింగ్‌ను జూనలో ప్రారంభించనున్నట్లు సమాచారం. ఇందులో కథానాయికగా జాన్వీ కపూర్ ఎంపికయ్యారు. ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. గేమ్ ఛేంజర్ చిత్రాన్ని అక్టోబర్ 10 న విడుదల చేయాలని మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నట్లు సమాచారం.

# ఐపీఎల్-2024 ట్రోఫీ ఎగరేసుకుపోయేది ఆర్సీబీనే

## ఇర్ఫాన్ పఠాన్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్



ఐపీఎల్-2024ప్లేఆఫ్స్?లో మూడు బెర్త్?లు కన్ఫర్మ్ అయ్యాయి. కోల్?కతా నైట్ రైడర్స్, రాజస్థాన్ రాయల్స్?తో పాటు సన్?రైజర్స్ హైదరాబాద్ ప్లేఆఫ్స్?కు చేరుకున్నాయి. ఇంకొక్క స్పాట్ కోసం ఆర్సీబీ-సీఎస్?కే ఢీ అంటే ఢీ అంటున్నాయి. ఈ రెండు టీమ్స్ మధ్య శనివారం డూ ఆర్ డై మ్యాచ్ జరగనుంది. ఇందులో చెన్నై గెలిస్తే చాలు.. ప్లేఆఫ్స్ వెళ్తుంది. కానీ బెంగళూరు మాత్రం బిగ్ మార్జిన్?తో నెగ్గాలి. అప్పుడే క్వాలిఫై అవ్వగలదు. చావోరేవోలా మారిన ఈ పోరాటం గురించి ఇప్పుడు అంతా ఎదురు చూస్తున్నారు. ఏ టీమ్ ప్లేఆఫ్స్?కు వెళ్తుంది? ఎవరు కప్పు నెగ్గుతారు? అనేది ఆసక్తికరంగా మారింది. ఈ తరుణంలో టీమిండియా మాజీ ఆల్?రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశాడు. కేకేఆర్, రాజస్థాన్ కాదు.. ఈసారి ఆర్సీబీ జట్టు ఐపీఎల్ కప్ ఎగరేసుకుపోవడం ఖాయమని పఠాన్ జోస్యం పలికాడు. ఆ టీమ్ ప్లేఆఫ్స్?కు క్వాలిఫై అయితే కష్టమని.. మరింత డేంజరస్?గా మారుతుందన్నాడు. వరుస విజయాలతో జోష్ మీదున్న బెంగళూరును ఆపడం ఎవరి తరం కాదన్నాడు పఠాన్. 'రేపటి ఫైట్?లో నెగ్గడం రెండు జట్లకు అంత సులువు కాదు. అయితే ఇప్పుడు ఆర్సీబీ మంచి ఊపు మీద ఉంది. అటు చూస్తే చెన్నై కాస్త డల్?గా ఉంది. పత్తిరానా, ముస్తాఫిజుర్, దీపక్ చాహర్ లేకపోవడంతో ఆ జట్టు బలహీనంగా కనిపిస్తోంది. ఒకవేళ రుతురాజ్ సేనను ఓడించి గానీ బెంగళూరు నెక్స్ట్ స్టేజ్?కు వస్తే మాత్రం ప్లేఆఫ్స్?కు వెళ్లిన మిగిలిన మూడు టీమ్స్?కు ఎంతో ప్రమాదకరం. ఇప్పుడు బెంగళూరు తోపు ఫామ్?లో ఉంది. ప్లేఆఫ్స్?కు వస్తే మాత్రం కప్పు తీసుకొనే వెళ్లేలా కనిపిస్తోంది' అని పఠాన్ చెప్పుకొచ్చాడు. పోరులో సీఎస్?కే కంటే ఆర్సీబీనే ఫేవరెట్?గా కనిపిస్తోందని పఠాన్‌అన్నాడు. గాయాల సమస్యలు, నయా కెప్టెన్, ధోని లీడర్?గా లేకపోవడం టీమ్?కు కాస్త నెగెటివ్?గా మారిందన్నాడు. అయితే బిగ్ మ్యాచెస్?లో ఎలా ఆడాలనే ట్రిక్ చెన్నైకి బాగా తెలుసన్నాడు. రుతురాజ్-ధోని కలసి టీమ్?ను గట్టెక్కిస్తారని అభిమానులు ఆశిస్తున్నారని పఠాన్ పేర్కొన్నాడు. కాగా, ఒకవేళ వర్షం కారణం రేపటి మ్యాచ్? రద్దయితే బెంగళూరుకు నిరాశే. చెన్నై ప్లేఆఫ్స్?కు చేరుకుంటుంది. ఈ మ్యాచ్ రిజల్ట్?తో ప్లేఆఫ్స్ రేసు ముగుస్తుంది. ఒకవేళ మ్యాచ్ జరిగితే ఆర్సీబీ తొలుత బ్యాటింగ్ చేస్తే కనీసం 18 పరుగుల తేడాతో సీఎస్?కేను ఓడించాలి. అదే మొదట బౌలింగ్ చేస్తే ఇంకో 11 బంతులు ఉండగానే ఛేజింగ్ పూర్తవ్వాలి.

# లగ్గం మూవీ డబ్బింగ్ పార్ట్



టాలీవుడ్ యువ నటులు సాయిరోనక్, ప్రగ్యా నగ్రా జంటగా నటిస్తున్న చిత్రం 'లగ్గం'. పెళ్లి నేపథ్యంలో తెలుగు సంప్రదాయాలను కళ్లకు కడుతూ తెరకెక్కుతున్న ఈ సినిమాకు రమేశ్ చెప్పాల దర్శకత్వం వహిస్తుండగా.. నటకిరిటి రాజేంద్రప్రసాద్ చాలా రోజుల తర్వాత కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం పోస్ట్ ప్రోడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. అయితే తాజాగా ఈ మూవీ డబ్బింగ్ పనులు మొదలుపెట్టినట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. రాజేంద్రప్రసాద్ తన పాత్రకు డబ్బింగ్ చెబుతున్న ఫొటోను ఎక్స్ వేదికగా పంచుకుంది. ఈ సినిమాపై దర్శకుడు మాట్లాడుతూ.. పెళ్లి తాలూకు ఆటపాటలు, మర్యాదలు, భావోద్వేగాలతో సాగుతుంది. తెలంగాణ నేపథ్యంలో చక్కటి ప్రేమకథగా అలరిస్తుంది' అన్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రానున్న ఈ సినిమాలో రోహిణి, సప్తగిరి, ఎల్బీ శ్రీరామ్, రఘుబాబు ముఖ్య పాత్రలు పోషిస్తుండగా.. వేణుగోపాల్ రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: బాల్‌రెడ్డి, సంగీతం: చరణ్ అర్జున్, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: రమేష్ చెప్పాల.